# సమర్థ సద్గురు


ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ : (0863) 2293280, 2293564, 2293206

web: www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



సంపాదక వర్గము

గూడూరి వెంకటరత్నం

డి.జె. బాలకృష్ణ లాల్

డా॥ ఎస్.రామతారక పరబ్రహ్మశాస్త్రి

మిస్.పి. ఇందిరాదేవి

డా॥ వి.వి.ఆర్. ప్రసాదరావు

డా॥ యమ్.స్వర్ణముఖి



Volume 30 Issue 2

No.of Pages 48

OCTOBER 2010

| | | |
|---|---|---|
| 5సం॥లచందా | రు. | 250.00 |
| 2సం॥ల చందా | రు. | 120.00 |
| సంవత్సర చందా | రు. | 60.00 |
| విడిప్రతి వెల ..... .. | రు. | 5.00 |

బ్యాంక్ డ్రాఫ్ట్ A/C.Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ పేరులో డ్రా చేయండి. M.O.,బ్యాంక్ డ్రాఫ్ట్ పంపవలసిన చిరునామా:

మేనేజరు

సమర్థసద్గురు మాగజైన్

శ్రీకాళీగార్డెన్స్-522508

Printed, Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - **DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL**


## ఈ సంచికలో.... పేజీ


| | |
|---|---|
| భద్రవాక్యం | 2 |
| అమ్మఆశీస్సులు | 3 |
| సంపాదకీయం | 4 |
| శ్రీలక్ష్మి స్తవం | 5 |
| బాబూజీ ఉవాచ | 6 |
| మాతాజీఅభిభాషణ | 9 |
| సన్నిధిలోసంభాషణ | 12 |
| శ్రీకాళీగార్డెన్స్‌లో కార్యక్రమాలు | 14 |
| సత్సంగసౌరభం | 17 |
| సంత్‌నామదేవ్ చరితామృతం | 20 |
| శ్రీకృష్ణతత్వము, ప్రేమయోగము | 23 |
| శ్రీకృష్ణ కర్ణామృతం | 25 |
| మౌనధ్యాన సప్తాహ శిబిరం | 27 |
| మాతాజీ బోధామృతం | 29 |
| మాతాజీ సత్సంగ్ డైరీ | 31 |
| శ్రీబాబూజీ దివ్యవాణి | 33 |
| సమర్థ సద్గురు నాథుని దివ్యచరిత్ర | 35 |
| అమెరికాలో శ్రీ మాతాజీ | 38 |
| ముక్తజీవిశ్రీమతిపాందువ్వకమలమ్మ | 41 |
| సాధకుడు | 43 |
| శ్యామసుందరా! ఒక్కసారి! | 46 |

# భద్రవాక్యం

-పరాశర ప్రసాద్

**శ్లో॥ "జాతస్య హి ధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృతస్య చ।**
**తస్మాదపరిహార్యేऽర్థే నత్వం శోచితు మర్హసి ॥"**

సామాన్య మానవులకు పుట్టుట, గిట్టుట అనేవి అనివార్యమే (అపరిహార్యే). తప్పించుకోలేరు. "అంత్యకాలములో మనస్సు స్థితి ఎలా ఉంటుంది?" అని ఒక భక్తుడు అడిగిన ప్రశ్నకు సమాధానంగా శ్రీబాబూజీ మహరాజ్ సమాధానం చెపుతూ "గురు స్మరణ మరచినవాడికే మరణవేదన. అది చాల భయంకరమైనది. అది మీకు చెపితే భయపడి ఇంక నిదురపోరు సుమా! అంత్యకాలంలో మనస్సులో మిగిలిన కోర్కెలకి సంబంధిత పంజరముతో కూడిన జన్మ తప్పదు" అన్నారు. గురుస్మరణ మరవని గురుబిడ్డ మాత్రం స్థూలదేశము విచ్ఛిన్నమైన మరుక్షణం మనస్సు ఆత్మలో లయమై సర్వత్రా వ్యాప్తమైన తానుగా ప్రకాశిస్తాడు. అక్కడ గుణాలు లేవు. వ్యధలేదు. అది కేవలం ఆనంద స్థితి. గురుబిడ్డ అంటే వివేకము, వైరాగ్యము, ఇంద్రియ సంయమనము కల్గిన ముముక్షువు అని శాస్త్రము చెప్తోంది కదా! ముముక్షువు అంటే ఎంతటి వ్యధ కల్గినా గురులక్ష్యార్థమునందు పరిపూర్ణ విశ్వాసము కలిగి సంకల్ప రహితుడైనవాడు అని మీ హృదయ బాబు హెచ్చరిస్తున్నారు అన్నారు. ఇది సాధ్యమేనా? అని సందేహము కల్గవచ్చు. అంత్యకాలంలో గురుస్మరణని ఆశ్రయించినవాడికి అన్యులకి అలభ్యమయ్యే మరణవేదనకి విలక్షణ స్థితి కరతలామలకం. ఎవరైనా వ్యాధిగ్రస్థులు మంచానపడి వైద్యం చేయించుకుంటే ఆ వ్యక్తి మీద బంధువులు మిత్రులు అందరూ అపారమైన ప్రేమని చూపుతారు "భగవంతుడా! ఎందుకు ఆయనను బాధ పెడతావు?" ఆయన బాధ చూడలేక పోతున్నాము" అంటారు. అది ఆ వ్యక్తికి ఉపశమనం కల్గిస్తుందా? ఆ వ్యక్తికి సంతోషాన్ని కలుగజేసే మంచి మాటలు చెప్పవచ్చు కదా! సద్గురు మూర్తిని ఆశ్రయించి గురులక్ష్యార్థ సాధన చేసే సాధకులకు మోక్షము తప్పదు కదా. జన్మరాహిత్యం పొందవలెనంటే కర్మరహితం అవక తప్పదు. సమర్థులైన సద్గురుమూర్తిని ఆశ్రయించి ఆయన ప్రసాదించిన లక్ష్యార్థ సాధనలో నిమగ్నమైన సాధకులెవ్వరికైనా జననము లేదు మరణములేదు. ఇది మాత్రం సత్యం. గురుదేవుల ముఖస్థుగా వెలువడిన నగ్నసత్యం. భక్తులకు సువర్ణావకాశము. *

# అమ్మ ఆశీస్సులు

**సర్వస్వరూపే! సర్వేశే! సర్వశక్తి సమన్వితే ।**
**భయేభ్యస్త్రాహినో దేవీ! దుర్గే! దేవీ! నమోస్తుతే ॥**

(శ్రీ సప్తశతీదుర్గా 11 అ. 24శ్లో॥)

శ్రీదుర్గా సప్తశతీ పారాయణలోని మంత్రములు శ్రీఆది పరాశక్తి అయిన తల్లి "రూపం రూపం బహురూపం బభూవ" అన్నట్లు అని రూపములు తానేయై, అన్నింటికి ఏలికయై, సర్వశక్తిని గలిగినదై, (తనను ఆశ్రయించిన) వారి సర్వ భయములనుండి, "త్రాహి", తరింపచేస్తున్న దుర్గమ్మ దేవికి నమస్కరిస్తూ మనమందరము శ్రీదేవీ శరన్నవరాత్రములను శ్రీసద్గురు దేవులు మనకు ప్రసాదించిన మహోత్సవములను మనసా వాచా కర్మణా ఆనందముగా జేసుకుంటున్నాము. ఇక్కడ మనసా - మనస్సుచేత సంకల్పము ప్రతీది తల్లి ఏ శక్తినైతే అందించినదో దానితో సత్సంకల్పములనే మనస్సు ధారణ చేస్తూ, వాచా వాక్కుచేత సర్వకాల సర్వ అవస్థలయందు ఆదిపరాశక్తి సేవలయందే స్మరణగలిగి వుండి, కర్మణా చేసే పనులన్నియు జగజ్జనని సేవలై వుండుట - ఇట్టి మహదవకాశము మన శ్రీగురుదేవులే మనకు ప్రసాదించి వున్నారు.

శ్రీగురుదేవులు ప్రసాదించినవి, వారుచేస్తూ చేయించినవి ఈ దేవీ నవరాత్రములు. అక్టోబర్ నెల 8వ తారీఖు ఆశ్వయుజ శుద్ధ పాడ్యమిన జగజ్జనని పూజలు మొదలయి అక్టోబరు 19వ తారీఖు ఆశ్వయుజ శుద్ధ ద్వాదశి వరకూ శ్రీసద్గురు పాదపూజ మహోత్సవముతో పూర్తి కానున్నవి. తిరిగి అయ్యగారి పూజలు శ్రీసద్గురుదేవుల పుణ్యారాధన మహోత్సవములు నవంబరు 24వ తేదీ కార్తీక బహుళ తదియనుండి మొదలు పెట్టుకుని నవంబరు 30 రాత్రి తెల్లవారితే డిశంబర్ 1 వ తారీఖున కార్తీక బహుళ దశమి నాటికి పూర్తగును. కనుక భక్తులందరము ఎంతెంతో ఉత్సాహంగా తరలివచ్చి ఈ కార్యక్రమములలో పాల్గొని తీర్థ ప్రసాదములను తీసుకుని తత్త్వమును విని ఆచరించుచుతూ తరింతుముగాక. శ్రీసద్గురు దేవుల దివ్య ఆశీస్సులతో మీ అమ్మ. *

- మీ అమ్మ

# సంపాదకీయం

ఆశ్రమవాసులు, సమర్థ సద్గురు ఆధ్యాత్మిక మాస పత్రిక గౌరవ సంపాదకులు శ్రీ శివరామమూర్తిగారు ఎంతో సమర్థవంతంగా ఉన్నత ప్రమాణాలతో సమర్థ సద్గురు మాసపత్రిక నిర్వహణ బాధ్యతను నిర్వహిస్తూ దేహ త్యాగము చేసిన విషయం మీకందరికి తెలిసినదే. శ్రీ మాతాజీవారి ఆదేశానుసారం శ్రీ శివరామమూర్తిగారు నిర్వహించే బాధ్యతను చేపట్టి, వారు ఏర్పరచిన మార్గదర్శక సూత్రాలతో నడుచుకుంటూ సమర్థ సద్గురు మాసపత్రిక చందాదారులైన భక్తులందరికి సేవలందించటానికి తగిన శక్తిని ప్రసాదించ వలసిందిగా సద్గురు దేవుల దివ్య చరణారవిందములకు ప్రణమిల్లుతూ ప్రధమ కర్తవ్యంగా మీముందు స్వాగతపూర్వక అభ్యర్థన.

శ్రీసద్గురు దేవుల పరమానుగ్రహంతో పూజ్య యోగిని శ్రీచంద్రకాళీ ప్రసాద మాతాజీవారి అనుగ్రహ పర్యవేక్షణలో భక్తి, శ్రద్ధలతో, ఎంతో వైభవోపేతంగా నిర్వహించు శ్రీదేవీ శరన్నవరాత్ర మహోత్సవాలు సమీపంలోనే ఉన్నాయి. భక్తులకు అన్య విషయాల గురించి ఆలోచించటానికి అవకాశంలేని కార్యక్రమాలు ఏర్పాటు చేయబడ్డాయి. నిత్యము శ్రీమాతాజీవారి బోధామృతము జుర్రుకునే సదవకాశము కల్గుతుంది. అంతే కాదు

**"శరణాగత దీనార్త పరిత్రాణ పరాయణే ।**
**సర్వస్యార్తి హరేదేవి నారాయణి నమోస్తుతే ॥"**

అని మనమంతా నిత్యము పారాయణ చేస్తాము. శరణుపొందిన దీనులను పరిరక్షించి అందరి ఆర్తిని, ఆవేదనను హరించే సృష్టిస్థితి లయకారిణి, పరమపావని, ప్రళయకారిణి, నతజనావని, భవభయ హారిణి, ఆ జగజ్జనని.

శ్రీదేవీ పూజా కార్యక్రమాలలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి శ్రీసద్గురు దేవుల అనుగ్రహానికి పాత్రులయ్యే సదవకాశాన్ని జారవిడుచుకోవద్దని ప్రార్థిస్తూ సవినయంగా, సాదరంగా ఆహ్వానిస్తున్నాము.

-పరాశర ప్రసాద్

*



# శ్రీలక్ష్మీ స్తవము

- 'శతావధాని' డా.వారణాసి శివరామకృష్ణ

1. ఓంకారమయీ! మాతా!
హ్రీంకారేశ్వరి! త్రిభువనజృంభిణి! దేవీ!
శ్రీంకారవిభవరూపిణి!
క్లీంకారాత్మిక! భగవతి! కీర్తి! లక్ష్మీ!

2. శ్రీలక్ష్మీదేవీ! కరు
ణాలయ! కొల్హాపురీవిహారిణి! హరిరా
జ్ఞీ! లలితానందమయీ!
బాలా! చంద్రస్మితాస్య! భగవతి! లక్ష్మీ!

3. నీ దయ కలిగిన జనులును,
మోదస్వాంతులు, సమగ్రభోగులు, ధాత్రిన్
నీ దయ లేని మనుష్యులు,
ఖేదాబ్ధి నిమగ్న భగ్నకీర్తులు, లక్ష్మీ!

4. అమ్మా! లక్ష్మీ! పద్యము
గొమ్మా, హృదయాబ్జమందు, గూర్చుండగ, రా
రమ్మా, కమ్మని విభవము
లిమ్మా, పూజింతు నిన్ను, హేలాలక్ష్మీ!

5. శ్రీలక్ష్మీ పుత్రులకే
కాలమ్మును, జెల్లు నధికగౌరవమహిమల్;
ఫాలమ్మున గేల్మోడ్చెద,
వలసిన వైభవము లిమ్ము, వర్ధితలక్ష్మీ!

6. నాదేశ మెపుడు, శాంతము
గా, దైవధ్యానమున బ్రకాశించుత! ధ
ర్మాధర్మమ్ముల ౦ వెలయుత!
వేదమ్ములు శాస్త్రకృతులు వెలుగుత లక్ష్మీ!

# బాబూజీ ఉవాచ

(గత సంచిక తరువాయి) - విజయేశ్వరానంద ప్రసాద్



యమునలోని జలజీవరాసులన్నీ దివ్యజ్ఞాన కాంతితో వెలిగిపోయేవి. ఆ పరమాత్మ చుట్టూ చేరి, వ్రేపల్లె వాసులంతా యిలా అన్నారు, "కృష్ణయ్యా! జ్ఞానులు, పండితులు మిమ్మల్ని పూజలు చేసి, మంత్రాలు చదివి తెలుసుకోగలరు. మాకు మంత్రాలు రావు, పూజలు చేయలేము. విద్యాహీనులము, గృహస్థులము, మూర్ఖులము. మానవాకారుడవైన నిన్ను నిరాకార, నిరంజన, నిర్వికల్పుడైన పరమాత్ముని‌గా ఎలా గుర్తించాలి? ఎలా తెలుసుకోవాలి? మాకు ఆ జ్ఞాన దృష్టి కలిగించి తరించే మార్గం చూపించు." అని వారందరు ఆయన్ను వేడుకున్నారు. "మంత్రాలు రావని, పూజలు చేతకావని, విద్యలేదని మీరు విచారపడవలసిన పని లేదు. తరించటానికి అవేవీ అవసరం లేదు. మీకందరికి నా పైన ఎంతో ప్రేమ ఉన్నది గదా! ఆ ప్రేమను మరింతగా పెంపొందించుకోండి. ప్రేమ అన్నా, విశ్వాసం అన్నా, భక్తి అన్నా ఒక్కటే. అటువంటి గాఢమైన విశ్వాసం నాయందు మీరు ఉంచండి. ఏ పని చేస్తున్నా సరే, హరే కృష్ణా అనో, ఓం కృష్ణాయనమః అనో హరే రామ హరే రామ అనో ఏదో ఒక నామం జపించండి. అదీ చేయలేకపోయినా పరవాలేదు. "మా కన్నయ్య, మా మురళీనాధుడు మాకు ఉన్నాడు. ఇక మాకు ఏ భయమూ లేదు" అనే గట్టి విశ్వాసాన్ని పెంపొందించుకోండి. చాలు" అని అభయమిచ్చాడు శ్రీకృష్ణ పరమాత్ముడు. " 'ఓం కృష్ణ, ఓం కృష్ణ, కృష్ణాయనమః' అని నిరంతరము స్మరిస్తే చాలు. ఈ కృష్ణ మహామంత్రాన్ని మధురాతి మధురమైన యీ నామామృతాన్ని ఎంత సేవించినా అజీర్తి చేయదు. ఈ పదార్థం భుజిస్తే జన్మ జన్మాంతర కర్మలు, వాసనలు హరిస్తాయి. జనన మరణ బంధం నుండి విముక్తి కలుగుతుంది." అని వారందరికి ఆ మంత్రోపదేశం చేశాడు శ్రీకృష్ణ పరమాత్ముడు.

ఇంకేం కావాలి? గోప గోపికలందరూ ఆ నామ జపం మొదలు పెట్టారు. తైల ధారవలె ఆగకుండా ఆ మంత్రజపం చేయటం వలన, ఏ పని చేస్తున్నా వారి మనస్సు కృష్ణయ్యపైనే నిలిచిపోయింది. కృష్ణయ్య కూడా వారి

మనస్సులలోనే నిలిచిపోయాడు. శుక్ల పక్షంలో పాడ్యమి నుండి చంద్రుని కాంతి ఎలా దినదినాభివృద్ధి పొందుతుందో, అదే విధంగా వారి మనస్సులలో ఆ ఇంద్ర నీలమణి కాంతి దినదినాభివృద్ధి పొందుతూ, పూర్ణిమనాటికి పూర్ణ చంద్రబింబంలాగా పూర్ణాకారం పొంది, చల్లని ఆత్మజ్ఞాన చంద్రికలను వారి హృదయాలలో వెదజల్లింది. వారి మనో మందిరాలలోని అజ్ఞాన తిమిరం పటాపంచలై పోయింది.

ఎప్పుడో ద్వాపర యుగంలోని గోపికల వరకు ఎందుకు? ఈ కలియుగంలోనే జరిగిన గొల్ల వెంకన్న కథ మనం యిదివరకు చెప్పుకున్నాం గదా! మేకల మందను మేపుకునే గొల్ల వెంకన్న గోపికల కన్న అమాయకుడు. ఇంకా గోపికలకు కృష్ణ దర్శనం అయ్యాక వాళ్ళలో భక్తి అంకురించింది.కాని మన గొల్ల వెంకన్నకు అటువంటి దర్శనమేమీ కాలేదు. అయినా, వైకుంఠవాసుడైన నారాయణమూర్తి దయను సంపాదించగలిగితే తన మేకల మంద వృద్ధి అవుతుందని, తన జన్మ తరిస్తుందని ఎవరో చెప్పారు. అప్పణ్ణించి అతనికి నారాయణ దర్శనం పొందాలని ఆరాటం మొదలైంది. ఆరాటం అయితే ఉందిగాని అందుకు ఏం చెయ్యాలో అతనికి తెలియదు. అందుకని ఆ దోవన వచ్చే పోయేవాళ్ళను, కాస్త చదువుకున్నట్లు కనపడిన వాళ్ళను అడిగేవాడు. పుస్తకాల్లోను, చదువులకూ దేవుడు దొరుకుతాడా? వాళ్ళకు తెలిస్తే గదా వెంకన్నకు చెప్పటానికి.

అటువంటి గొల్ల వెంకన్నకు ఒక పండితుడు దొరికాడు. ఈ పండితుడూ చాలా శాస్త్రాలు చదువుకున్నవాడే. పూజలూ, పునస్కారాలూ, జప తపాలూ చాలా చేసినవాడే. అయితేనేమి? ఆయన హృదయంలో కీర్తి కాంక్ష, ధనాశ మెండుగా ఉన్నాయి. సర్వ వాసనా రహితం అవనిదే వాసుదేవ దర్శనం ఎలా కలుగుతుంది? గదిలో కూర్చుని తలుపులు మూసుకొని, వెలుగు లోపలికి రాలేదంటే ఎలా వస్తుంది? అజ్ఞానమనే చీకటి అల్లుకుపోయి ఉంది. తలుపులు తెరిస్తే కాంతి గది లోపలికి పోతుంది. అహంకార మమకారాలనే తలుపులు మూసి ఉన్నంత వరకు మానవుడు తన హృదయంలోనే ప్రకాశిస్తున్న పరమాత్మను దర్శించలేడు. ఆ తలుపులు తెరచి వేస్తే జ్ఞాన భాస్కర కిరణాలు ప్రవేశించి అజ్ఞాన తిమిరాలను తొలగిస్తాయి. ఆ కాంతిలో వస్తు దర్శనమవుతుంది. తానెవరో తాను తెలుసుకోగలుగుతాడు. వడ్లగింజ వండుకుని తింటానికి పనికిరాదు. పైన ఉన్న పొరలు తొలగిస్తే బియ్యపు గింజ

బయటపడుతుంది. అది మనకు శక్తినిచ్చే పదార్థం. అది వడ్లగింజలోనే ఉంది గాని బయట లేదు. ఈ సత్యాన్ని గ్రహించలేని మానవుడు కమలం దగ్గరే ఉన్న కప్పవంటి వాడు. ఆ కప్ప ఆ కమలం మీదనే కూర్చున్నా, దాని మీద గంతులు వేసినా, తన బురదను కమలానికి అంటించ గలదే గాని కమలంలోని మకరందాన్ని గ్రహించలేదు. ఆ మకరందాన్ని ఆస్వాదించటం భ్రమరానికే చెల్లు. అలాగే హృదయనివాసి అయిన పరమాత్ముని దర్శించటానికి భక్తునికే చెల్లు. జ్ఞానికే చెల్లు.

మన పండితుడు కమలం దగ్గర ఉన్న కప్పవంటివాడు. ధనం కోసం, కీర్తి ప్రతిష్టల కోసం ఆ దేశపు రాజు వద్దకు వెడుతూ, ఎండలో ప్రయాణ బడలికతో అలసిపోయి ఉన్న అతనికి గొల్ల వెంకన్న కనిపించాడు. తన క్షుద్బాధను తీర్చటానికి గొల్ల వెంకన్న ఎంతో ప్రేమతో, గౌరవంతో భూతదయతో యిచ్చిన మేకపాలను శుభ్రంగా తాగి, పండితుడు కడుపు నింపుకున్నాడు. ఆ కృతజ్ఞత అయినా లేకుండా, ఆ వెట్టి గొల్ల వెంకన్న నారాయణ దర్శనం పొందే మంత్రం చెప్పమని కోరితే, గొల్లవానికి మంత్రం చెప్పకూడదనే జాత్యహంకారంతో "ఓ బొల్లి గద్దనెక్కిన నల్లనయ్యా! వైకుంఠవాసా! ఈ పాయసం ఆరగించి పోవయ్యా" అని ఒక కల్లబొల్లి మంత్రం అల్లి, అదే అతనికి చెప్పి, తన తెలివికి తానే సంతోషిస్తూ, వెళ్ళిపోయాడు.

అయితేనేమి? మన గొల్ల వెంకన్న అచంచల విశ్వాసంతో, తిరుగులేని పట్టుదలతో ఆ మంత్రాన్నే జపించి, లక్ష్యార్థ స్వరూపుడైన లక్ష్మీ నారాయణుని యందే మనస్సును లయింపచేసి, ప్రాణ త్యాగానికైనా సిద్ధపడి శ్రీనారాయణ దర్శనం సాధించుకోగలిగాడు. రోజూ నల్లనయ్య(నారాయణుడు) బొల్లి గద్దనెక్కి (గరుడవాహనం) వెంకన్న వద్దకు వచ్చి, అతను వండి నివేదన చేసిన పాయసం ఆరగించి, భుక్త శేషమైన మహా ప్రసాదం స్వయంగా వెంకన్నకు తినిపించేవాడు. ఆ ప్రసాద మహిమ వలన వెంకన్నలోని కామక్రోధాది గుణాలు, వాసనలు, అంతరింద్రియ లక్షణాలు అన్నీ హరించి, మనస్సులోను, బయట కూడా వైకుంఠ నాధుడే కనిపించాడు. అదే దృష్టి అతనికి నిలబడిపోయింది. వైకుంఠనాధుడు భక్త ప్రియుడుగదా, వెంకన్న మేకల మందా వృద్ధి పొందింది; అతని భక్తీ వృద్ధి పొంది పరిపూర్ణమై, అతని మనస్సులో పరమాత్మ సుస్థిరుడై నిలబడిపోయాడు.

-సశేషం

# మాతాజీ అభిభాషణ

(గతసంచిక తరువాయి) -జపమాల ప్రసాద

మెయిన్ స్విచ్ ఆపేస్తే, ఇంట్లో లైట్లన్నీ ఆరిపోయినట్టు, మనస్సుని కట్టేస్తే ఇంద్రియాలన్నీ కూడా పనిచేయడం మానేస్తాయి. "గాలినైనా మూటకట్టవచ్చునేమో గానీ, మనస్సు మట్టుకు కట్టడం దుష్కరం, కనుక నేనేం చేయాలి?'' అని గీతాచార్యుడిని, అర్జునుడు అడిగాడు. దృఢమైనటువంటి పట్టుదల (తీవ్ర వైరాగ్యం)తో పట్టు విడువకుండా నిరంతరం అభ్యాసం చేస్తే, నీ మనస్సుని అదుపులో పెట్టుకోవచ్చునని చెప్పాడు శ్రీకృష్ణపరమాత్మ. చంచలమైన పాదరసాన్ని తులసిరసంలో వేసి బాగా నూరితే, పాదరసం గట్టి గుండురాయిలాగా



అయిపోతుంది అని గురుమహరాజ్ ఎప్పుడూ చెప్తూవుండేవారు. అది ఎలా జరుగుతుంది అని నేను చిన్నప్పుడు Experiment (ప్రయోగం) చేసి చూశాను. అలా కొన్ని రోజులు పట్టు విడవకుండా తులసిరసంతో నూరేసరికి నిజంగానే పాదరసం (Mercury) గట్టి వుండ అయిపోయింది! గురుమహరాజ్ మాట ఎప్పటికీ అసత్యం కాదు కదా! దీనివలన నాకు తెలిసినదేమిటంటే, పాదరసం లాగ చంచలమైన మనస్సుని, భగవన్నామమనే తులసిరసంతో కలిపి, పట్టుదలతో బాగా నూరితే (అంటే నిరంతర విచారణ చేస్తే) దాని చంచలత్వం పోయి, ఘనస్వరూపాన్ని పొందుతుంది. మనస్సుని ఆ భగవంతుని దివ్య చరణారవిందముల యందు నిలిపినా, మనస్సు నందు భగవచ్చరణారవిందములు నిలుపుకున్నా, మనస్సు భగవద్రూపాన్నే పొందుతుంది. ఇదే 'శమము' అంటే. శమము కలిగితే ఇక శాంతే. మనస్సు చెప్పినట్టల్లా ఆడుతూ, నాకు శాంతి కావాలి అనుకుంటూ 'శాంతి శాంతి శాంతి' అని నోటితో ఎన్ని లక్షలు జపం చేసినా, పేపరు మీద ఎన్ని కోట్లు వ్రాసినా, శాంతి రాదు, దానిని గురించి మనం ప్రయత్నం చేస్తే వస్తుంది. అశాంతిని తెచ్చిపెడుతున్న మనస్సుని, శాంతిధామమైన భగవంతుని యందు నిలిపి హాయిగా నామ సంకీర్తన చేసుకుంటే శాంతిని చాలా సులభంగా పొందవచ్చు. కలికాలంలో మానవులు

యోగాలు, తపస్సులూ చేయలేరు కనుక తరించడానికి చాలా సులభమైన మార్గాన్ని సూచించారు మహాత్ములు. అదే భగవన్నామ సంకీర్తన (అని ఈ కీర్తన గానం చేశారు).

"మనసార హరిభజన చేయరా
నోరార నారాయణా అనరా॥

1. పాటే రాదని ప్రజలు నగుదురని
గాత్ర శుద్ధియే కమ్మగ లేదని
పాటకు సరియగు తాళము లేదని
భయము బిడియము బాధ వలదురా॥

2. పాటయు తాళము గాత్రమున్నను
మనసేలేని స్మరణే వృధరా
తనువొక చోట మనసొకచోట
ఉన్న మానవుని జన్మమె వృధరా॥

3. యోగియైన మహాభోగియైన
పూర్వజన్మ సుకృతమె పోదురా
నారాయణుని నామ స్మరణచే
నరకపు బాధలు నాశనమౌరా॥"

నారాయణ నామస్మరణ వున్నచోట కామక్రోధాది గుణాలుంటాయా? 'నారాయణా!' అని మనం అంటే, 'నా నాయనా' అని వస్తాడాయన. మనని రక్షించడానికి. ప్రపంచంలో అలా ఎవరినైనా పిలిస్తే ఛాదస్తం అని మనని తీసిపారేస్తారు. భగవన్నామం మట్టుకు ఎన్నిసార్లు అన్నా ఆనందమూ, శాంతేగాని, అశాంతి అనేది ఉండదు.

ఈ చేతులతో అనేక రకమైన పనులు చేస్తారు మానవులు. బస్సుల్లో వెళ్తూ పైన రాడ్లు పట్టుకుంటారు; చేతులెత్తి బూజులు దులుపుతారు; వేలకువేలు రూపాయలు కుమ్మరించి యోగా క్లాసులకి వెళ్ళి, వాళ్ళు చేతులెలా త్రిప్పమంటే అలా త్రిప్పుతారు - కానీ ఇంద్రియాలన్నీ పనిచేస్తున్నా, సర్వస్వతంత్రులై వుండి కూడా, చేతులెత్తి భగవన్నామం చేసుకోవడానికి దేహాభిమానం అడ్డు వస్తుంది! చైతన్య మహాప్రభువు, గురుదేవులు శ్రీ బాబూజీ మహరాజ్ వంటి మహాత్ములు రెండు చేతులూ పైకెత్తి చక్కగా చప్పట్లు కొడుతూ, నృత్యం చేస్తూ భగవన్నామాన్ని బిగ్గరగా అంటూ ఆనందోత్సాహాలతో సంకీర్తన చేసేవారు. అది దేహానికి మంచి వ్యాయామం (Exercise) కూడాను.

నువ్వు చెయ్యి, చెయ్యి అని ఎన్నిసార్లు Dictate (శాసించి చెప్పడం) చేస్తామండీ? క్లాసులో చక్కగా విన్న విద్యార్థికి 98% లేక 99% మార్కులు వస్తాయి. ఆఖరి నిమిషంలో గైడు చదివి పాసవ్వాలనుకునేవారికి 35% మార్కులే వస్తాయి. అందుకే వినేటప్పుడు ఒళ్లంతా చెవులు చేసుకుని వినాలి. భక్తి అనేది ఒకరు చెప్తే వచ్చేది కాదని చెప్తోంది 'భక్త్యష్టకం'

భక్తి స్వతంత్రా। స్వవశీకృతేశ్వరా।
స్వాభావికీ। స్వానుభవైక గోచరా।
స్వాయంభువీ। స్వాగమ మార్గవర్తినీ।
స్వచ్ఛంద వృత్తి:। స్వరుచిర్విరాజితే।

భక్తి అనేది స్వతంత్రంగా వుండాలి. భగవంతుడు నావాడు అనుకుంటే మనవాడే అవుతాడు. అది స్వభావ సిద్ధంగా రావాలి గాని ఎవరో చేస్తే వచ్చేది కాదు. ఎవరికి వారి స్వానుభవానికి అది గోచరిస్తుంది. అది మనని సత్యమార్గంలో (వేదమార్గంలో) నడిపిస్తుంది. భగవంతుడు మనవాడనుకున్నప్పుడు మనం ఇంకెవరినీ యాచించనక్కరలేదు. భక్తి అనేది స్వయంభూ అంటే తనకు తానుగా వచ్చి వెలసినదై వుంటుంది.

దేని గురించి భగవంతుడిని ఉపాసించాలి? ఏ శాంతి కోసం మనం వెదుక్కుంటున్నామో, అది కేవలం భగవంతుడి దగ్గరే దొరుకుతుంది. భగవంతుడంటే ఎక్కడో వేరుగా లేడు. భగవంతుడు గుడిలో లేడు. గుడికెళ్లి భగవద్దర్శనం చేసుకోవాలి అని నీలో సంకల్పం కలిగితే అక్కడే వున్నాడు భగవంతుడు. ఆ అనంతశక్తి లేక చైతన్యము నీలో ఉంటేనే, గుడిలోని దేవుడిని నీవు చూడగలుగుతున్నావు.

నీలో భక్తి ఈశ్వరుడిని స్వవశం చేసుకుంటుంది. ఎవరికి వారు స్వయంగా అనుభవించాలి. భక్తిని ఆశ్రయించినవారు తప్పుడు త్రోవలు పట్టరు. ఎందుకంటే అది మనని వేదసమ్మతమైన మార్గంలోనే నడిపిస్తుంది. కొంచెం లోతుకి వెళ్దాం. శబరి, గుహుడు, కన్నప్ప ఏం వేదాలు చదివారు? ఎవరయితే భగవంతుడి యందు అచంచలమైన భక్తి కలిగివుంటారో వారి మాటే వేదమై కూర్చుంటుంది. వేదాలు వారి వెంట నడిచి వస్తున్నాయి. ప్రహ్లాదకుమారుడికి 'నారాయణా, నారాయణా!' అని అనడం ఒక్కటే తెలుసు. చండామార్కులు చెప్పనక్కరలేకుండానే చదువులన్నీ వచ్చేశాయి అతడికి.

-సశేషం

# సన్నిధిలో సంభాషణ

(గతసంచిక తరువాయి) - పరాశర ప్రసాద్

ఈ కార్యక్రమం అంతా ముగిసిన తరువాత శ్రీబాబు నన్ను, మూర్తీజీ, నారాయణరావుగారు, రత్నంగారు, డా॥ రాజుగారిని రమ్మనమని కబురుచేశారు. మేమంతా వెళ్ళి శ్రీబాబు దర్శనార్థం దూరంగా కూర్చుని భయం భయంగా నిరీక్షిస్తున్నాము.

శ్రీబాబు మమ్మల్ని ఉద్దేశించి మాట్లాడుతూ "ఎవరువారు ఘోషా స్త్రీలలాగా అక్కడే కూర్చున్నారు. ఓహో! మీరు పురుషులేనా?'' అన్నారు. మానవునికి ఏ రకమైన అహంకారము పనికిరాదు. అది వాడి పతనానికి దారి తీస్తుంది. మానవుడి మనస్సు దేనికి అలవాటు పడితే తిరిగి దానినే కోరుతుంది. "మీరంతా సత్సంగాలకి అలవాటు పడ్డారు. ప్రార్థన, ధ్యానం కూడా సాధనలలో ప్రధానమైనవని మరువకూడదు. తెల్లవారుజామున లేచి రోజూ ధ్యానం చేయాలి. నేను చెప్పిన వీటినన్నిటినీ విస్మరించి, మనస్సు విషయాదుల మీదకి వెళ్ళేలాగా భగవంతుడు ఎందుకు చేయాలి? ఆయన అనుజ్ఞ లేనిదే ఏ పని జరగదు గదా? అనే ఆలోచనలు కూడా కొందరి భక్తుల మనస్సులో కలుగుతున్నాయి.'' అన్నారు.

అక్కడ ఉన్న భక్తులందరికి భోజనం ఏర్పాటు చేశారు. భోజన కార్యక్రమం అయిన తరువాత శ్రీబాబు క్రితంరోజు విశాఖపట్నంలో జరిగిన సత్సంగ విశేషాలు చెప్పారు. క్రితం రోజు రాత్రి 2-30ని॥ వరకు జరిగిన సభా విశేషాలను వివరిస్తూ ఒక పండితుడు పద్యం చదివి వినిపించాడట. ఆ పద్యం సీతమ్మవారు హనుమంతునికి వినిపిస్తూ శ్రీరామచంద్రుడు అవతార పురుషుడని ఆయన గుణగణాలను ప్రస్తుతించారని చెప్పారు. ఆయన ఇంకా మాట్లాడుతూ హనుమకి శ్రీరామచంద్రుడు అవతారపురుషుడని తెలియదా? అయితే హనుమ భక్తుడు ఎలా అయ్యాడు? అని సందేహాన్ని వెలిబుచ్చాడట.

దానికి శ్రీబాబు సమాధానం చెబుతూ హనుమ భక్తిని నిరూపించే కథ చెబుతాను అన్నారు. 14సంవత్సరాల ఆరణ్యావాసానంతరం శ్రీరామ చంద్రుడు సీతమ్మవారితో ఏకాంతంగా కూర్చుని సంభాషణ చేద్దామని అనుకున్నాడు. సీతమ్మ కూడా అలానే భావించింది. కాని వారిద్దరికి నడుమ హనుమ ఉన్నాడు. హనుమ శ్రీరామపాదసేవ చేస్తూ తన్మయత్వంలో ఉంటాడు.

శ్రీరామచంద్రుడు హనుమను ఎలాగైనా బయటకి పంపటానికి ఆలోచన చేసి తనకి అలసటగా ఉందని, మానస సరోవరంలో నీరు తీసుకు రమ్మనమని చెప్తాడు. తోకకి అందించిన పాత్ర క్షణంలో మానస సరోవరం లోని నీరు తెస్తుంది. సప్త సాగరాలలో నీరు తెమ్మన్న ప్రయత్నం కూడా ఫలించదు. ఎన్ని విధాల ప్రయత్నించినా హనుమ శ్రీరామచంద్రుని పాదసేవ మాత్రం వదలడు. శ్రీరామచంద్రునితో ప్రియభాషణం చేయాలని సీతమ్మ కుతూహల పడుతోంది. స్వామి వంక దీనంగా చూస్తూ ఎలాగైనా హనుమను బయటకి పంపే ప్రయత్నం తానే చేయాలనుకుంటుంది.

'హనుమా! నేను స్వామితో చాల ముఖ్యమైన రహస్య సంభాషణ చేయాలి. కొంచెంసేపు బయటకి వెళ్తావా?' అని కోరుతుంది. హనుమ సమాధానం చెబుతూ "అమ్మా! మీ బిడ్డని నేను ఉంటే మీ రహస్యానికి ఏమి అడ్డు?" అంటాడు. సీతమ్మ మాట్లాడుతూ "హనుమా! నువ్వు పెద్దవాడివి కదా!" అంటుంది. వెంటనే హనుమ మూడు నెలల బాలునిగా మారిపోతాడు. సీతమ్మ చివరికి హనుమకి అసలు విషయం తెలియజేస్తూ నువ్వు ఇక్కడ ఉండకూడదు అంటుంది. హనుమ మాట్లాడుతూ,"నేను స్వామిని వదలి ఒక్క క్షణమైనా ఉండలేను కాబట్టి నేను రామా! అని పిలిచేసరికి రాముడు పలికేటట్లయితే నేను బయటకి వెళ్ళి నా స్వామి స్మరణ చేసుకుంటాను." అంటాడు. శ్రీరాముడు హనుమ పెట్టిన షరతు విని చిరునవ్వుతో "సరే!" అంటాడు.

హనుమ వెంటనే బయటకి వెళ్ళి రామనామాన్ని జపిస్తాడు. నామానికి నామానికి మధ్య గ్యాప్ లేకుండా స్పీడ్ పెంచుతాడు. శ్రీరామ చంద్రుడు'ఆ'అనినోరు తెరచి అలానే ఉండిపోతాడు. దానిని చూసిన సీతమ్మగాని, అక్కడ ఉన్న పెద్దలుగాని ఏమీ చేయలేకపోతారు. వశిష్ఠులవారు కూడా నిస్సహాయులై చూస్తూ ఉంటారు.

ఇంతలో నారదుడు వచ్చి విషయాన్ని గ్రహించి హనుమ ఏడి? అని అడిగి హనుమ రామనామంలో మైమరచి ఉన్న విషయాన్ని గ్రహించి అసలు కీలకం ఎక్కడ ఉందో తెలుసుకుంటాడు. "శ్రీరామచంద్రా! నీకు ఎంతపని జరిగింది ప్రభూ!" అని గట్టిగా అంటాడు నారదుడు. వెంటనే హనుమ "నా ప్రభువుకి ఏమైంది?" అని స్వామి సన్నిధికి వస్తాడు. వెంటనే శ్రీసీతారామచంద్రులు హనుమని పాదసేవ చేసుకోమని అంటారు.

-సశేషం

# శ్రీకాళీగార్డెన్స్‌లో విశేషపూజా కార్యక్రమములు

**అక్టోబరు 2010**

3 ఆది శ్రీ గురుదశమి, సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

6 బుధ మాస శివరాత్రి

**8 శుక్రవారము నుండి, 19 మంగళవారం వరకు శ్రీదేవీనవరాత్రోత్సవములు.**

ప్రతిరోజు ఉదయం 6 గం.లకు బ్రహ్మశ్రీ కొండూరు రామ సుబ్రహ్మణ్యం గారిచే వేద పఠనము, శ్రీ చండీ సప్తశతి పారాయణ, 8 గం.లకు శ్రీ రామతారక పరబ్రహ్మ ప్రసాద్, మరియు శ్రీవెంకటరమణ ప్రసాద్ గార్లచే శ్రీదేవీ భాగవత ప్రవచనము. మధ్యాహ్నము జగన్మాత కుంకుమార్చనలు, హారతి, మంత్రపుష్పము, దర్బారు, భక్త సమారాధన సాయంకాలము -6 గం.లకు ప్రార్థన, 7 గం.లకు జగన్మాత సాయంకాలపూజ, తీర్థ ప్రసాదములు. 9 శనివారము నుండి 18 సోమవారము వరకు ఆధ్యాత్మిక ప్రవచనములు, శ్రీమాతాజీవారి అనుగ్రహభాషణము, మరియు ఆశ్రమ భక్తుల ఆధ్యాత్మిక ప్రసంగములు, శ్రీ గురుదేవుల దివ్యదర్శనము,బోధ (వీడియో), శ్రీ బాబూజీ మహరాజ్ వాడిన వస్తువులమ్యూజియమ్ ప్రదర్శన (అర్థగంట)

8 శుక్ర ఉదయం గం.6.35 నిలకు శ్రీమాతాజీవారి శ్రీదేవీ శరన్నవరాత్రి పూజా దీక్షా స్వీకారము

13 బుధ శ్రీ సరస్వతీపూజ, మూలా నక్షత్రం.

15 శుక్ర దుర్గాష్టమి. ఉదయం శ్రీ జగన్మాత సామూహికపూజలు,

16 శని మహర్ణవమి.

17 ఆది విజయదశమి, ఉదయం శ్రీ జగన్మాత సామూహికపూజలు, నామకరణములు, అన్నప్రాశనలు,అక్షరాభ్యాసములు రామాలయంలో జరుగుతాయి.

18 సోమ ఏకాదశి, ఏకాహం,దీక్షావిరమణ, పూజాక్షతలు శ్రీమాతాజీ భక్తులపైన చల్లుతారు,రాత్రి 7 గం.లకు జగన్మాత దర్శనోత్సవము (ఊరేగింపు.)

19 మంగ రాత్రి 8 గం.లకు శ్రీ సద్గురు పాదపూజ.

22 శుక్ర పూర్ణిమ, శ్రీమాతాజీవారి 56వ జన్మదినోత్సవము,శ్రీ సద్గురు పాదపూజ,సత్సంగం, భక్త సమారాధన.

**నవంబరు 2010**

1 సోమ శ్రీ గురుదశమి, సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

| | | |
|---|---|---|
| 4 | గురు | మాస శివరాత్రి, నరక చతుర్దశి, ఉదయం సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ. |
| 5 | శుక్ర | దీపావళి, ఉదయం సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ. భక్త సమారాధన, రాత్రి 8 గంటలకు టపాసులు పేల్చుట |
| 9 | మంగ | నుండి 17 బుధవారం వరకు ప్రతి రోజు ఉదయం శ్రీ రామలింగేశ్వర స్వామి వారికి పంచామృతాలతో నవ రసాలతో అభిషేకాలు, లక్షబిల్వార్చన |
| 17 | బుధ | క్షీరాబ్ది ఏకాదశి, శ్రీ సత్యనారాయణవ్రతం, శ్రీ సద్గురు పాదపూజ |
| 18 | గురు | శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన |
| 21 | ఆది | గురుపూర్ణిమ, శ్రీగురునానక్ జయంతి ,శ్రీ సద్గురు పాద పూజ, సత్సంగం, భక్త సమారాధన, సాయంకాలం శ్రీ మహాకాళికా పరమేశ్వరీ రామలింగేశ్వరుల నగర దర్శనోత్సవం, జ్వాలాతోరణం,చాతుర్మాస్య దీక్షా విరమణ |

**నవంబరు 24బుధవారం నుండి డిశంబరు 1బుధవారం వరకు శ్రీ గురుదేవుల ద్వావింశతి వార్షిక పుణ్యారాధన మహోత్సవాలు**

24 బుధవారం ఉదయం 7.34 ని.లకు పంచ యజ్ఞ సహిత పుణ్యారాధన మహోత్సవ సాప్తాహ్నిక దీక్షా స్వీకరణ, పంచ యజ్ఞ ప్రారంభం.రాత్రి7 గం.లకు శ్రీ సద్గురుదేవుల పుణ్యారాధన.

ప్రతిరోజు ఉదయం 8 గం.లకు శ్రీ రామ తారక పరబ్రహ్మ ప్రసాద్, శ్రీ వెంకటరమణ ప్రసాద్ గార్లచే శ్రీ గురుగీతా ప్రవచనము.

25వ తేదీనుండి - 30వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 4 గం.లకు సుప్రభాతం, నగర సంకీర్తన 5 గం.లకు ప్రాతఃకాల ప్రార్థన, మహా మంగళహారతి.6గం.లకు బ్రహ్మశ్రీ కొండూరు రామ సుబ్రహ్మణ్యంగారిచే వేద పఠనము, ఆలయ దర్శనములు, తీర్థ ప్రసాదములు

24 - 30 వరకు మధ్యాహ్నం శ్రీ సద్గురు శత సహస్ర నామార్చనము, మహామంత్ర పుష్పము, దర్బారు. అనంతరం శ్రీ మాతాజీవారు భక్తులకు తీర్థం ఇస్తారు. భక్త సమారాధన సాయంత్రం 6 గం.లకు ప్రార్థన మహా మంగళహారతి.

25 - 30 వరకు ఉదయం 9 గం.లకు సత్సంగ సమావేశము, శ్రీ మాతాజీవారి అనుగ్రహభాషణ సద్గురుదేవుల దర్శనము, బోధ (వీడియో). శ్రీ బాబూజీ మహరాజ్ వాడిన వస్తువుల మ్యూజియమ్ ప్రదర్శన (అర్ధగంట)

| | | |
|---|---|---|
| 27 | శని | రాత్రి 7 గం.లకు ఊంజల సేవ (డోలోత్సవం) |
| 28 | ఆది | సామూహిక సద్గురు పూజలు. రాత్రి 7 గం..లకు నౌకా విహారం |

(తెప్పోత్సవము)
30 మంగళ ఉదయం 10గం. లకు శ్రీ సద్గురు పాద పూజ
రాత్రి 7 గం.లకు శ్రీ సద్గురుదేవుల మహాపుణ్యారాధన.
1.12.10 బుధ ఉషఃకాలం 3 గం.లకు శ్రీ సద్గురుదేవులకు రుద్ర, నమక, చమకములతో మహాభిషేకము, మహా మంగళ హారతి, దీక్షా విరమణ, నగర దర్శనోత్సవం
గమనిక పెద నింద్రకొలను ఆశ్రమ శాఖలో శ్రీ సద్గురు పాద పూజ, సత్సంగము, భక్త సమారాధన, రాత్రి 7 గం.లకు తెప్పోత్సవం.

## గ్లోబల్ డాక్టర్స్ మీట్

ఎస్.హెచ్.కె.వి.టి. బాబు ట్రస్ట్ హాస్పిటల్ 20వ వార్షికోత్సవ సందర్భంగా అక్టోబర్ 10వ తేదీ ఆదివారం "గ్లోబల్ డాక్టర్స్ మీట్" ఏర్పాటు చేయబడినది. ఈ సభకు దేశ విదేశాలనుండి డాక్టర్లను ఆహ్వానిస్తున్నాము. యోగిని శ్రీ చంద్ర కాళీ ప్రసాద మాతాజీ వారు ఈ సభకు విచ్చేసి తమ అనుగ్రహభాషణమును ఒసగెదరు. ఈ సభకు విచ్చేసిన వారందరికీ శ్రీ మాతాజీ వారు సద్గురుదేవుల ఆశీస్సులను అందించెదరు.

## మీ అనుభవాలను వ్రాసి పంపండి

మనం శ్రీ సద్గురు దేవులను ఆశ్రయించాం. జీవితంలో వచ్చే అనేక ఒడుదుడుకులనుండి మనకు రక్షణ జరుగుతోంది. ఎన్నో ఆపదలనుండి మనలను శ్రీ గురుదేవులు కాపాడుతున్నారు. ఆ గురుశక్తే శ్రీ మాతాజీ వారి ద్వారా భక్తులను రక్షిస్తున్నది. శ్రీసద్గురుదేవులతో, శ్రీ మాతాజీ వారితో భక్తులు పొందిన అనుభవాలు మాకు వ్రాసి పంపండి. త్వరపడండి!

# సత్సంగ సౌరభం

-శివ ప్రసాద్

(గతసంచిక తరువాయి)

ధ్యానం ధ్యానం అంటే ఏదో అని కాదు! ధ్యానం అంటే చిత్తంలో మార్పు. చింతన చెయ్యి. ఒక్కొక్క మెట్టే ఎక్కుతూ ఉండు. పృథ్వి తత్వాన్ని దాటు, జలతత్వాన్ని దాటు, అగ్నితత్వాన్ని దాటు, వాయుతత్వాన్ని దాటిపో, ఆకాశ తత్వాన్ని కూడ దాటిపో. అప్పుడు నీకు సమాధి కలుగుతుంది. ఎప్పుడు సమాధి కలుగుతుంది? నీవు పృథ్వీతత్వంలో ఉంటే నీకు సమాధి రాదు. జలతత్వంలో ఉంటే సమాధి రాదు. అగ్ని తత్వంలో ఉంటే సమాధి రాదు. వాయు తత్వంలో ఉంటే సమాధి రాదు. ఆకాశాన్ని కూడా దాటిపో. చిదాకాశంలోకి వెళ్ళిపో. ఏ తత్వంలో ఉన్నామో ఎలా గుర్తు పట్టటం? నీవు ధ్యానానికి కూర్చున్నపుడు నీకు ఆ కూర్చున్న స్పృహ కనుక ఉంటే, నీవు పృథ్వీ తత్వంలో ఉన్నవాడివే. నీ దృష్టి గనుక నీ నడుము క్రింద వరకు ఉంటే, ఆసనము మీద ఉంటే, అంత వరకూ పృథ్వీ తత్త్వంలో ఉన్నట్లు. నీ దృష్టి వాటిమీద లేకుండా పోతే అప్పుడు నీవు పృథ్వీ తత్వాన్ని దాటినట్లు, జలతత్వం అంటే నాభి వరకు. ఆ తరువాత అగ్నితత్వం పొట్టలో ఉంటుంది. మనం పొట్టలో వేసిన పదార్థాలన్నీ ఏమౌతాయి? పొట్టలోకి వెళ్ళి భస్మం అయిపోవటంలా? అలా భస్మం కావటం అగ్నితత్వం వలన. దానిని దాటితే వాయుతత్వం. కంఠం దాటిపో. వాయుతత్వం శిరస్సు వరకు వెళ్ళిపో. దానిని దాటితే బ్రహ్మ కపాలం. అది ఆకాశతత్వం. ఇవన్నీ దాటిపోవటమంటే ఏమిటి? స్పృహ లేకుండా పోవటమే. స్పృహ లేకుండా పోవటమంటే ఏమిటి? ఏది పోవటము? నిద్ర పోవటమా? కొంతమంది ధ్యానానికి కూర్చొని తూగుతూ ఉంటారు. వాళ్ళు చెప్తుంటారు మా గురువుగారు ఎంత తన్మయత్వం కలిగితే అంత తూగుతారు అని. పైకి క్రిందకూ, ముందుకు వెనక్కూ ఊగాడా అది నిద్రేగాని, తన్మయత్మం ఏ మాత్రం కానేకాదు.

నేను కొన్ని మిషన్స్‌కు వెళ్ళాను. వాటి పేరు చెప్పనులెండి. నన్ను వారు వచ్చి తీసుకొని వెళ్తే వెళ్ళాను. ధ్యానానికి వాళ్ళు కూర్చొని పొర్లాడుతున్నారు. అది తన్మయత్వం కానేకాదు. నేను పబ్లిక్(public)గా చెప్పేశాను. అది రోగం అని చెప్పాను. ధ్యానానికి కూర్చున్నప్పుడు నిశ్చలంగా కూర్చో. కూర్చోటం కూడ ఎలా? ఇందాక బాబుగారు చెప్పారే, అలా

సుఖాసనంలో కూర్చోవాలి అంటే 'స్థిరం సుఖమాసనం' అని చెప్పారు. నీకు కాళ్ళు కదపకుండా ఉండటానికి ఏ ఆసనం సుఖంగా ఉంటుందో అదే నీకు సుఖాసనం. అలాగే నేరుగా పృథ్విమీద కూర్చోకూడదు. ఏదైనా ఆసనం వేసుకొని కూర్చోవాలి. మా గురువుగారు చెప్పారు. అలాగే శిరస్సుపైన కూడ ఏదైనా గుడ్డ వేసుకుంటే మంచిది అని. లేకపోతే పృథ్వీ ఆకర్షణ శక్తి, ఆకాశం ఆకర్షణ శక్తి రెండూ ధ్యానానికి అవరోధం కలిగిస్తాయి. నీవు పృథ్వినీ, ఆకాశాన్నీ కూడ దాటి పోవాలి. అలా ఆసనం వేసుకొని, శిరస్సుపైన వస్త్రం కప్పుకొని, రెండు చేతులూ కలిపి నిటారుగా ధ్యానానికి కూర్చో. వెన్నెముక నిటారుగా ఉండాలి. అది నిటారుగా ఉండకుండా వంగి పోయిందా, నీకు సంకల్ప వికల్పాలు వచ్చి పడతాయి. మనకు ధ్యానం చేసుకొనే అవకాశం ఉంది కనుకనే మనకు వెన్నెముక తిన్ననిది ఇచ్చాడు భగవంతుడు. మిగతావాటికి తిన్నని వెన్నెముకను ఇవ్వలేదు. పశుపక్ష్యాదులకు ఇవ్వలేదు. మనకొక్కళ్ళకే ఇచ్చాడు. కూర్చొనేటప్పుడు వెన్నెముక నిటారుగా ఉంచి భగవద్గీతలో చెప్పినట్లు

**సమంకాయం శిరోగ్రీవం ధారయన్నచలం స్థిరః**
**సంప్రేక్ష్య నాసికాగ్రం స్తవం దిశశ్చా నవలోకయన్ ॥**

అలా కూర్చోవాలి. అంతేగాని ఊరికే ఏదో ఇష్టం వచ్చినట్లు కూర్చొని, సంకల్పాలు పోవాలంటే ఎట్లా పోతై?

ఎలా కూర్చోవాలో భగవద్గీతలో భగవంతుడు చెప్పాడు. గురువులు చెప్పారు. ఆ విధంగా కూర్చొని ధ్యానం అలవాటు చేస్తే, అప్పుడు సంకల్ప వికల్పాలు రాకుండా పోతాయి. వెన్నుపూస వంగిందా, సంకల్పం వచ్చి పడ్డట్లే. అందువల్ల ఆ విధంగా కూర్చొని, ధ్యేయాయాః చింతనా ధ్యానం. ఆ ధ్యేయమైన పరబ్రహ్మ తత్త్వాన్ని గుఱించే మనం ధ్యానం చేయాలి.

అలాంటి ధ్యానం చేస్తే ఏమౌతుంది? చేయగా చేయగా నీవు ధ్యేయ స్వరూపమై పోతావు. సగుణో బ్రహ్మోపాసకులకు అది లేదు. అక్కడ సగుణ ధ్యానంలో త్రిపుటి ఉంటుంది. కేవలం నిర్గుణ ధ్యానంలోనే త్రిపుటి రహితమౌతుంది. అందువల్ల ధ్యేయవస్తువైన నిర్గుణ పరబ్రహ్మ తత్త్వాన్ని ధ్యానం చేసేవారు మాత్రమే పరబ్రహ్మ స్వరూపులు అవుతారు. అందువలన ధ్యేయాయాః చింతనం ధ్యానం. ఆ చింతన చేసేదానికే మానవ జన్మ వచ్చింది. దాని కోసమే మన పుణ్యం వలన మనకు సద్గురువులు లభించారు. ఆ పుణ్యాన్ని మనం వృద్ధి చేసుకోవాలి. వచ్చిన దానిని వృద్ధి చేసుకోకపోతే ఏమౌతుంది?

మా గురుదేవులు చెప్పేవారు. ఒక మూకుడు నిండా కణకణలాడే నిప్పులు ఇచ్చారు, దానిలో పుడకలు వేస్తే మంట అవుతుంది. ఆ మంట వల్ల ప్రకాశం వస్తుంది. ప్రకాశం వల్ల చీకటి పోతుంది. అలాకాకుండా దరిద్రుడు పుడకలు వెయ్యకుండా విసరకుండా ఉంటే నిప్పులు ఏమౌతాయి? మసి అయిపోతుంది. బూడిద అయిపోతుంది. అంటే మనకు కూడ భగవంతుడు పుణ్యం అనేది ఇచ్చాడు. ఆశ్రమంలోకి చేరాము మనం అంటె ఆ పుణ్యం ఉంది కాబట్టే. ఆ పుణ్యాన్ని మనం ఇంకా పెంచుకోవాలి. పెంచుకోకపోతే బూడిద అయిపోతాం మనం. మీ పుణ్య విశేషం వలన మీరందరూ ఆశ్రమంలో చేరారు. గురుపాదాన్ని ఆశ్రయించారు. రోజూ ధ్యానం చేస్తున్నారు. ఈ ధ్యాన సప్తాహ కార్యక్రమంలో, మీ ధ్యానానికి అవరోధాలు ఏవైతే ఉన్నాయో, వాటిని తొలగించుకోవటానికి బాబుగారి సందేశం, అమ్మగారి సందేశం మీరు వింటున్నారు. వాటిని అమలు చేసుకొని, మీరు ధ్యానాన్ని చేసుకొని, ఆ ధ్యానానికి లక్ష్యమైన పరబ్రహ్మ స్వరూపము ఏదైతే ఉన్నదో, ధ్యేయ వస్తువుగా మీరు ప్రకాశించెదరుగాక.

అలా ప్రకాశించే శక్తిని, సామర్థ్యాన్ని సద్గురునాథుడు, జగన్మాత మనందరికి అనుగ్రహించి, మనందరను ఆశీర్వదించుగాక! *

ధనాన్ని గురించి గర్వించదగినది ఏదీ లేదు. నేను ధనికుడనంటావా, నీ కంటె ఎందరో అధిక ధనవంతులున్నారు. వారితో పోల్చి చూస్తే నువ్వు వట్టి దరిద్రుడవని చెప్పాల్సి వస్తుంది. సంజ చీకట్లు కమ్మగానే మిణుగురులు బైలుదేరి "మేమే ప్రపంచానికి వెలుగునిస్తున్నాం" అని గర్విస్తాయి. కాని నక్షత్రాలు మినుకు మినుకుమని ప్రకాశింపగానే మిణుగురుల గర్వం అణగుతుంది. అప్పుడు నక్షత్రాలు "లోకాన్నంతా మేమే ప్రకాశింపచేస్తున్నాం" అని తలపోస్తాయి. కాస్సేపయ్యాక చంద్రుడు ఉదయించి తన అమృత కిరణాలతో ప్రకాశించగా, నక్షత్రాలు వెలవెలపోతాయి. ఆ చంద్రుడు, తన కాంతితో లోకాన్నంతా శోభాయమానం చేస్తున్నానని పొంగిపోతుంటాడు. ఇంతలో ప్రభాతం తూర్పుదిశను సూర్యోదయవైభవాన్ని చాటుతుంది. అప్పుడు చంద్రుడి ప్రభావం ఏమైంది?

ధనాధికులమని విర్రవీగేవారు ఈ ప్రకృతి యాథార్థాలను అవలోకించి తమ భోగభాగ్యాలను గురించి, అధికారాన్ని గురించి మిట్టిపడకుంటారు గాక!

- శ్రీరామకృష్ణ బోధామృతం నుండి

# సంత్ నామదేవ్ చరితామృతం

(గతసంచిక తరువాయి) -మనోజ్ కుమార్

**సుల్తాన్ -** అల్లా తాలాకు మరోపేరు లేదు.

**నామ -** కాని అల్లా తాలాకు అనేక పేర్లు ఉన్నై. అన్ని నామాలు అల్లా తాలావే. అందులో విఠల ఒకటి.

సుల్తానుకు కోపం వచ్చింది. "మీ కళ్ళముందే మీకిష్టమైన ఆవును దాని దూడను హింసించి చంపుతాను. మీ విఠలుడెవడో వాణ్ణి వచ్చి రక్షించుకోమనండి. ఇవాళ అటో ఇటో తేలిపోవాలి.'' పైకి గంభీరంగా మాట్లాడుతున్నా సుల్తాను వెన్నులో సన్నగా వణుకు పుడుతున్నది. ఒకవేళ ఆ విఠలుడెవడో నిజంగా వస్తే..... ఇంతవరకు తన ముందు తలయెత్తి ఇంత ధీమాగా ధైర్యంగా మాట్లాడిన మగాడు లేడు. వీడి వాలకం చాల చిత్రంగా ఉన్నది. అయినా ఇదంతా ఎందుకు? ఆవును చంపుతా. అది చస్తుంది. విఠలుడు అబద్ధం అని నిరూపణ అవుతుంది. ఆ తరువాత అల్లా పేరు మీద ఈ కాఫిర్‌ను కూడా బలి ఇస్తే సరి అని ఆవును దూడను తీసుకొని రావలసిందిగా ఆజ్ఞాపించాడు, సుల్తాన్.

మెడలో తాడుతో అమాయకంగా చూస్తున్న ఒక తెల్లటి ఆవును, దాని కన్నా తెల్లగా శుభ్రంగా ఉండి మూగచూపులు చూస్తున్న దాని చిన్నారి లేగ దూడను సుల్తాను దగ్గరికి తీసుకొని వచ్చారు. సుల్తాను బొడ్డులో ఉన్న కైజారు పిడిపై చేయి వేశాడు. భక్తుల నామం తారస్థాయికి చేరింది, 'జయ జయ రామకృష్ణ హరీ! పాహి పాండురంగా! పాండురంగా కృపాకరో! గోవిందా కృపా కరో!.........' సుల్తాను చుట్టూ చూశాడు ఎటునుండి వస్తాడో విఠలుడు అని. విఠలుడి జాడ లేదు. అతడు బొడ్డులోనుంచి కత్తితీసి ఆవు దగ్గరకు వచ్చి "యా అలీ ఈ ఆవును నీకు కానుక ఇస్తున్నాను'' అంటూ కత్తిని పైకి ఎత్తాడు. అంతే! ఆశ్చర్యంగా ఆ పైకి ఎత్తిన చెయ్యి క్రిందకు దిగలేదు. నామదేవుడికి ఇదేమీ పట్టలేదు. అతడు నిమీలిత నేత్రాలతో భజనలో లీనమై ఉన్నాడు. చేయి తన స్వాధీనంలో లేదు అని తెలియగానే సుల్తాను బెంబేలు పడ్డాడు. కత్తిపిడితోపాటు తన పిడికిలిని కూడ ఎవరో గట్టిగా పట్టుకుని నులుముతున్నట్లు భరించరాని బాధ. కత్తి వదిలేస్తే సిగ్గుచేటు. చేతి నొప్పి భరించరానిదిగా అయింది. అతడు మనస్సులో అల్లాను ప్రార్థించాడు "యా

అలీ ఇది నాకు కాదు, ఇస్లాముకు పరీక్ష. యా అలీ నేను నీ దాసుణ్ణి. ఈ సైతాన్లు నన్ను ఎంత సంకటంలో ఇరికించారు? అల్లా మాలిక్! నా పరువు కాపాడు. ఈ ఆవును చంపే అవకాశం ఇవ్వు.'' చేతిని ఎవరో ఇంకా గట్టిగా నులుముతూ మెలిపెడుతున్నారు. చెయ్యి క్రిందికి దింపటానికి వలను పడకుండా పైకి గుంజుతున్నారు. బాధ భరించలేక సుల్తాను మళ్ళీ పెద్దగా మొర పెట్టుకున్నాడు "నా చేతిని ఎవరో గట్టిగా మెలి పెడుతున్నారు. అది కొయ్యబారి పోయింది. నా చేతిని క్రిందకు దింపే అనుమతి అయినా ఇయ్యి. యా అలీ నొప్పి, నొప్పి. నొప్పి భరించలేక పోతున్నాను.'' నొప్పి భరించలేక సుల్తాను ఎడమచేత్తో లబ లబ నోరుకొట్టుకున్నాడు. అందరూ ఏమి చేస్తే ఏమి అవుతుందో అని చలనంలేని బొమ్మల్లాగా చూస్తున్నారు. సుల్తాను ఇక బాధను ఓర్చుకోలేక"యా అలీ ముఝే మాఫ్ కరో'' అంటూ "రిహా కర్దో బాబాకో'' అని పెద్దగా అరిచాడు. సిపాయిలు నామదేవుణ్ణి శరణు పొందారు. సుల్తాన్ని తెచ్చి నామదేవుడి పాదాల వద్ద మోకాళ్ళపై కూర్చోబెట్టారు. కళ్ళ నీళ్ళతో సుల్తాను దీనాతిదీనంగా నామదేవుడితో "నీవే నా ఖుదావి, నా అల్లావి. నా పొరపాటు వలన నిన్ను గుర్తించటంలో ఆలస్యం చేశాను. నా చేతిని మామూలుగా చేయి బాబా!'' అన్నాడు.

**నామ** - (ప్రశాంతంగా)అల్లా దయాళువు. ఆయనను శరణు పొందండి.

**సుల్తాన్** - విఠల్ అనబడే ఓ అల్లా! నిన్ను శరణు పొందుతున్నాను.

**నామ** - బాద్శాహ్! నేను ముందే చెప్పాను, విఠల్, అల్లా ఒక్కళ్ళే అని. ఆ దృష్టితో చూడండి, సత్యం మీకు అనుభవానికి వస్తుంది. మా రాముడు మీకు రహీమ్. మా కృష్ణుడు మీకు కరీమ్. వాళ్ళు బీదల, దీనుల, నిస్సహాయుల హృదయాలలో ఉంటారు. వారిని గుర్తించండి. వారికి రాజు సాయం కావాలి. కడుపుకింత తిండి, కట్టుకోవటానికి ఇంత బట్ట, ఉండటానికి ఏదో చిన్న గూడు ఉంటే చాలు, ఆ అల్పసంతోషులకు. అవి ఉంటే 'దాల్ రోటీ ఖావో, ప్రభూ కే గుణ్ గావో' అంటూ హరి భజనలో కాలం గడిపేస్తారు.

అందరూ మళ్ళీ నామదేవుడి చుట్టూ తిరుగుతూ విఠల నామం అందుకున్నారు. ఆవు కృతజ్ఞతతో నామదేవుడి వైపు కన్నీరు కారుస్తూ చూస్తున్నది. మూగగా చూస్తున్న ఆవు దూడని యజమాని అంతటా ముద్దు పెట్టుకుంటూ నామదేవుడికి దండం పెట్టుకుంటున్నాడు.మహమ్మద్ తుఘ్లక్ నామదేవులకు నమస్కరించి వినమ్రంగా అన్నాడు 'బాబా! రాజు ఎలా ఉండాలో

మీరు నాకు తెలియజేశారు. ఎవరి మతం వారిది. ఎవరి విశ్వాసం వారిది. ఇక నుండి నేను గద్దె దిగేవరకు మతపరంగా ఎవ్వరూ ఇతరుల విషయాలలో జోక్యం కలుగజేసుకోకూడదు, హింసించకూడదు అని ఫతవా రాస్తాను' అంటూ నామదేవుడికి అనేక బహుమతులు, భూములు, జాగీర్లూ రాసి ఇచ్చాడు. బంగారు కాసులు రాసులుగా పోశాడు. నామదేవుడు అక్కడికక్కడే తన కిచ్చిన భూములను, ఆస్తులను మఠాలకు, ఆశ్రమాలకు, ధర్మ సత్రాలకు ఇచ్చేశాడు. యమునా నది ఒడ్డున పేదలందరికీ కడుపునిండా తృప్తిగా భోజనాలు పెట్టి బంగారు కాసులు దక్షిణగా ఇచ్చి చేతులు దులిపేసుకున్నాడు.

పంజాబ్‌లో వ్యాసపీఠాలను నిర్మించి పీఠాధిపతులకు, బీదసాదలకు అండగా ఉండమని ఆదేశాలు ఇచ్చాడు. నామదేవుడి అభంగాలు, కీర్తనలు, భజనలు అనంతరం పంజాబ్‌లో అవతరించిన మహాత్ముల గ్రంథాలలో చోటు చేసుకున్నాయి. హరి నామ సప్తాహం జరిగింది. తరువాత అందరూ నామదేవుడికి వీడ్కోలు ఆరతి ఇచ్చారు. మఠపు బాధ్యతలు బహోరదాస్ అనే అంతరంగ భక్తుడికి అప్పజెప్పి ఇరవై సంవత్సరాల తరువాత అప్పటికే ఎనభై ఏళ్ళ వృద్ధుడైన నామదేవుడు అందరి వద్ద సెలవు తీసుకొని పంఢరికి తిరుగు ప్రయాణం అయినాడు.

నర్మదను దాటి, ఘోరారణ్యాలను దాటుకుంటూ నామదేవుడు త్ర్యంబకేశ్వరం వచ్చాడు. నివృత్తినాథ్‌గారికి మనసారా నమస్కరించాడు. సూక్ష్మ రూపంతోనే ఆశీర్వదిస్తూ, చిరునవ్వుతో నివృత్తినాథుడు ఆళంది వైపు చూపుడు వేలుతో చూపాడు. నామదేవుడు చాకణ్ ఘాట్ కొండలు దాటి ఆళందిలో అడుగు పెట్టగానే సిద్ధేశ్వరాలయం ఎదుట విశ్రమించిన జ్ఞానదేవులకు నామా అడుగుల సవ్వడి వినిపించింది 'వచ్చావా నామా! నీ విజయ యాత్ర నేను సూక్ష్మ దేహంతో చూస్తూనే ఉన్నాను. ఇక్కడి నుండి నీవు వెళ్ళి నప్పటి నుండి నేను నీతోనే, నీలోనే ఉన్నాను. నిన్ను సుల్తాన్ పరీక్షించి నప్పుడు ఆవును, దూడను నేనే అయి అక్కడే ఉన్నాను. ఆరోజు సుల్తాన్ చేతిని పట్టుకుని స్తంభింప చేసిందీ నేనే. అతని అంతఃకరణాన్ని నేనే మేలుకొలిపాను. పాండురంగడు నీ రూపంలో వచ్చి మాకు సమాధిని ఇస్తే, పాండురంగడే నీకు స్వయంగా సమాధిని ఇస్తాడు. హే సనత్కుమారా! లోక కళ్యాణం కోసం నీవు మళ్ళీ మళ్ళీ అవతారాలు స్వీకరించి భవిష్యత్తులో అనేక సంత్‌ల రూపాలు ధరిస్తావు.

-సశేషం

# కృష్ణతత్త్వము, ప్రేమ యోగము

- సుషుమ్న ప్రసాద

(గతసంచిక తరువాయి)

జున్నాదేవి, తన పుత్రుని చూడగానే హృదయానికి హత్తుకొని, ప్రశంసించి ఇలా నుడివింది "వత్సా, నీ విజయము కొరకై, నేను గంగామాతను ఆరాధిస్తాను..." ప్రవీరుని అర్ధాంగి మదన మంజరి, యుద్ధములో తన భర్త చూపిన ప్రతిభను ప్రశంసించి, ఆనందముతో ఇలా పల్కింది "శ్రీకృష్ణ పరమాత్మను నా భక్తితో మెప్పించి, మీ విజయమునకై ప్రార్థిస్తాను." ప్రవీరుడు ఆ రాత్రంతా కృష్ణ ధ్యాన నిమగ్నుడై, తన ఉనికినే మరిచిపోయాడు.

అర్ధరాత్రి గడిచిన తరువాత ప్రవీరుని ప్రియసతి రాకుమారి మంజరి, సర్వులూ నిద్రాదేవి ఒడిలో సేద తీర్చుకొనుచుండగా, అర్జునుని యుద్ధ శిబిరములో ప్రవేశించింది. ఆమె ఒరనుండి బయటకు తీసిన పెద్ద కత్తిని చేపట్టింది. శంకరుడు తన త్రిశూలముతో శిబిరము బయట కాపలా కాస్తున్నాడు. శంకర భగవానుడు మదన మంజరి నెదుర్కొని, గాఢ నిశీధిలో, ఆయుధాన్ని ధరించి, రాకుమారి రాకకు కారణమేమిటని ప్రశ్నించాడు.

మదన మంజరి వెంటనే ఉన్న విషయాన్ని ఏమీ దాచకుండా పరమ శివునికి నివేదించింది. "నేను ప్రవీరుని అర్ధాంగిని, నా భర్త ప్రాణాలు రక్షించమని, శ్రీకృష్ణ ప్రభువును ప్రార్థించటానికి ఈ నిశీధి వేళ యుద్ధ శిబిరమునకు వచ్చాను."

అప్పుడు శంకర భగవానుడు "నీ కోరిక సాధ్యం కాదు. శ్రీకృష్ణ పరమాత్మ విశ్రాంతి తీసుకొంటున్నారు. నీవు వచ్చిన ప్రదేశమునకు తిరిగి వెళ్ళ వచ్చును. వెంటనే మదన మంజరి "అలాగైతే ఈ ఖడ్గముతో నా శిరస్సును ఖండించి మీ పాదాలపై పడ వేస్తాను" అని ఖడ్గమును తీసింది.

వెంటనే అంగ రక్షకుని రూపంలో ఉన్న పరమ శివుడు ఆమె భక్తికి. ధైర్య సాహసముల కచ్చెరువొంది, మదన మంజరికి తన స్వస్వరూప సాక్షాత్కారమును ప్రసాదించి, కైలాసమునకు తరలి వెళ్ళాడు.

పరమేశ్వర సాక్షాత్కారమునకు పరవశించిన మదన మంజరి వెంటనే శ్రీకృష్ణ భగవానుడు ఉన్న గుడారము వద్దకు వెళ్ళింది. అక్కడ ఎదురైన కాపలాదారునితో, "నేను నీలధ్వజ మహారాజు కోడలను. నా పతి ప్రాణభిక్షకై శ్రీకృష్ణ పరమాత్మను ప్రార్థించటానికి వచ్చాను." అని చెప్పింది. వెంటనే

కాపలాదారుడు "స్వామి ఇప్పుడే విశ్రమించారు. నీవు కలవటం సాధ్యం కాదు" అన్నాడు.

మదనమంజిరి వెంటనే ఒరనుండి ఖడ్గమును తీసి, "స్వామిని దర్శించటానికి అనుజ్ఞ ఇవ్వకపోతే, ఈ ఖడ్గముతో నా శిరస్సును ఛేదించి నీ పాదాలపై పడవేస్తాను" అని ధీరత్వంతో పలికింది.

అలా తన ప్రాణాన్ని సమర్పించటానికి సిద్ధమైన మహాభక్తురాలి భక్తికి ముగ్ధుడై, అంగరక్షకుని రూపంలో ఉన్న కృష్ణ పరమాత్మ మదన మంజరికి తన నిజస్వరూపంతో దర్శన భాగ్యమును ప్రసాదించాడు. ఆమె స్వామి దర్శన భాగ్యముతో మంత్రముగ్ధయై, సాష్టాంగంగా ప్రణమిల్లి, వినమ్రతతో ఇలా ప్రార్థించింది,"హే ప్రభూ మీరు సర్వజ్ఞులు, మీకు అంతా తెలిసినా, నా మనవి విన్నవించుకొంటున్నాను, సూర్యోదయము కాగానే విశ్వ విఖ్యాతి గడించిన ధనుర్ధారి అర్జునుడు నా భర్తను ఎదుర్కొంటాడు. అర్జునుడు మీ అండదండలతో ఏమైనా సాధించ గలడు. కనుక నా భర్తకు ప్రాణ భిక్ష పెట్టమని మిమ్ములను ఆర్తితో, వినమ్రతతో వేడుకొంటున్నాను." అన్నది.

కరుణా సముద్రుడైన కృష్ణ భగవానుడు ఆమె భక్తికి మెచ్చి కౌమోదకి, సుదర్శన చక్రములనే తన ఆయుధములను ఆమెకిచ్చి "ఇటు చూడు, ఈ ఆయుధములు రెండూ నీ భర్త చెంత నున్నంత వరకు, ప్రవీరుని యుద్ధములో ఎవరూ వధించలేరు." అని దీవించాడు.

మదన మంజరి వెంటనే స్వామికి మోకరిల్లి, వెనుదిరిగి, తన భవనమునకు చేరి ఆయుధములను తన భర్తకిచ్చి, విషయమును వివరించింది.

ప్రవీరుని తల్లి జ్వాలాదేవి గంగా భవానిని ప్రార్థించి, పరమ శివుని ప్రవీరునికి సాయపడేట్లు చేయమన్నది కాని పరమ శివుడు శ్రీ కృష్ణుడు అర్జునుని సహాయార్థము వస్తే, తాను కృష్ణప్రత్యర్థిగా ఉండటం అసాధ్యమని నిరాకరించాడు.

సూర్యోదయము కాగానే, అర్జునుడు తన సఖుడు, ప్రియ బాంధవుడైన భగవానుని దర్శనార్థమై వెళ్ళి, శ్రీ కృష్ణ ప్రభువు నేల చూపులు చూస్తూ చింతా క్రాంతుడై, ఉండటం గమనించి, కారణమేమిటని ప్రశ్నించాడు. అందులకు భగవాన్ శ్రీకృష్ణుడు తాను మదన మంజరి భక్తికి ముగ్ధుడై ఆమెకు కౌమోదకిని, సుదర్శన చక్రమును ప్రసాదించానని ఆ రెండు ఆయుధములు ప్రవీరుని చెంత ఉన్నంతవరకు అతని నెవ్వరూ జయించలేరని చెప్పాడు. పైగా, "నా సన్నిధి వలన నీ మార్గములో తప్పనిసరిగా అవరోధములే కలుగ వచ్చును." అన్నాడు.

-సశేషం

# శ్రీకృష్ణ కర్ణామృతం

(గతసంచిక తరువాయి) - సుశీలా ప్రసాద

ఆ ముద్ద తనూ తినాలని అనుకుంది గాని ఎగిరి వెళ్ళే బలం లేదు తనకి. కొమ్మ చివర చిగురాకులు ఎర్రగా కనిపిస్తే అవి కొరికింది. వగరుగా ఉన్నా, ఆ బాలుని చూస్తూ తింటుంటే తియ్యగా ఉన్నాయి.

అంతలో కన్నయ్య తన మొలలోంచి వెదురు గొట్టం తీసి పెదాలనానించి ఊదసాగాడు. అది మధురమైన పాటగా పరిసరాలన్నీ నిండి, విశ్వమంతా వ్యాపించి విన్నవారందర్నీ ఆనందడోలికలలో ఊగిస్తున్నది. అది చిట్టితల్లి చెవులని సోకి మనస్సుని తాకి ఒళ్ళంతా పులకరింప చేసింది. ఆ గానమూ, బాలుని రూపమూ తానెప్పుడో ఎక్కడో విన్నట్టు, చూసినట్టు అంతరాంతరాలలో అలజడి రేగింది. అలాగ మైమరచి ఎంతసేపుండిపోయిందో తెలివివచ్చేసరికి ఎదురుగా ఉన్న దృశ్యమంతా మాయమైంది. ఆ పిల్లన గ్రోవి రాగాలు చెవులలో మారుమ్రోగుతుంటే మరువలేకుండా ఉన్న చిట్టితల్లి మెల్లిగా కంఠమెత్తి దాన్ననుసరించి పలికేందుకు ప్రయత్నించసాగింది. ఒకసారి ...రెండుసార్లు.... పదిసార్లు అదే అదే.... పదే పదే.....

పొద్దువాలి గూటికి చేరిన కాకమ్మకి పిల్లలన్నీ చేరి "అమ్మా అమ్మా ఇన్నాళ్ళూ నోరు తెరవని చిట్టితల్లి ఇవాళ అదేపనిగా ఏదో పలుకుతోంది. అయితే అది మన అరుపులాగ లేదు. నువ్వెంత బ్రతిమాలి పెట్టినా తిననిది ఇవాళ చిగుళ్ళు కొరికి తింటోదమ్మా అని నేరాలు చెప్పాయి. కాకమ్మ గ్రాన్పడి నిలచిపోయింది. అనుమానం కలిగి కాదేమోలే అనుకుని సరిపెట్టుకుంది.

రాత్రి అయింది. అంతా పడుకున్నారు. చిట్టితల్లికి నిద్రలేదు. కళ్ళు తెరుచుకుని కిందకి చూస్తూ కూచుంది అలాగే. గోపాలుడు వస్తాడేమో మురళి వాయిస్తాడేమోనని ఆశతో. ఆకాశంలో గుండ్రంగా చంద్రుడు వచ్చాడు. ఆ వెనక ఆ బాలుడు వచ్చాడు. చిట్టి తల్లికి తన ఎదురు చూపులు ఫలించినందుకు పరమానందమైంది. ఎవరెవరో కూడా వచ్చారు. ఆ పాదాలు చిట్టితల్లికెంతో సన్నిహితంగా తోచాయి. "కృష్ణా మురళి ఊదవా" అన్న వారి కోర్కెను మన్నించి మధురాతి మధురమైన తన పిల్లన గ్రోవి పాటను వినిపించసాగాడు. అది వింటూ ఉండబట్టలేకపోయింది చిట్టితల్లి. గళం విప్పి ఆ పాటతో శృతి కలిపింది.

అది వింటూ కాకమ్మ నిద్రలేచింది. తనలో కోపం ఉవ్వెత్తున పొంగింది. "నువ్వా! నా అనుమానం నిజమేనన్నమాట. నీ తల్లి కని పెంచటానికి బద్ధకించి

నా గూట్లో వదిలివెళ్ళిన కోయిల పిల్లవు నువ్వు. అందుకే మాలో కలవని లక్షణాలు నీలో కనిపించాయి. నా బిడ్డవేననే భ్రమలో పడి నిన్ను పెంచిన నా మమకారమంతా ఇప్పుడింక తెంచేసుకుంటున్నాను. ఇన్నాళ్ళ బంధం ఇంతటితో సరి ఇక ఒక క్షణం నా దగ్గర ఉండటానికి వీల్లేదు పో.'' అంటూ నెత్తిమీద ఒక తన్ను తన్ని క్రిందకి తోసేసింది.

గాలిలో గిరికీలు కొడుతూ, కళ్ళు తిరిగి పడిపోతూ వచ్చి వచ్చి చెట్టు కిందపడింది. మెత్తగా హాయిగా ఉండి ఆప్యాయంగా వీపు నిమురుతున్న శ్యామసుందరుని వడిలో కళ్ళు తెరిచింది చిట్టితల్లి. ఆ స్పర్శ ఎంతో ఆనంద దాయకంగా ఉంది. అడుగడుగునా అందాలు చిందుతున్న స్వామి చూపులో చూపు నిలిపి చూసింది. కలువరేకులవంటి ఆ కళ్ళల్లో కరుణామృతం జాలువారుతున్నది. మాటిమాటికీ ఆ దయారస వృష్టి అధికమవుతోంది. నిత్య నూతనమై స్నేహమయములైన వాని చూపులు గమనిస్తూ తన ప్రభువును గుర్తించింది చిట్టితల్లి. "దేవదేవా! నువ్వు...నేను...'' అనేలోపు 'ఔను వైకుంఠ వాసులమే. నాడు నా సన్నిధిలో ఉండి విరించి చదివే వేదమంత్రాలను నీవు నీ స్వరంలో అనుసరించి పలకాలని కోరుకున్నావు. నేడు నేను ఆ వేదసారమంతా నా మురళిలో నింపి వాయిస్తే విని నీ గొంతులో సాధన చేసి దాన్ననుసరించి మధరాతిమధురంగా పలిగావు. మహాజ్ఞానులు మాత్రమే గుర్తించ గలిగిన అన్ని చదువుల మూలమైన ప్రణవ నాదాన్ని నా వేణువులో నింపి మ్రోగించగా నా పాటను నువ్వు నీ కంఠంతో కమ్మగ పలికావు. నీ కోరిక తీరినట్టేగద! నీకు తృప్తి కలిగే వరకు నాతోనే ఉండి ఆపైన యధాస్థానానికి మరలిపో!'' వరదాత వాక్కులు అమృతప్రాయములై చిట్టితల్లి పాటకు ప్రాణం పోశాయి.

కరుణారస భరితములై స్నేహమయములై నిత్యనూతనమై, దయారస వృష్టి దినదిన ప్రవర్థమానంగా అడుగడుగునా అందాలు చిందుతున్న మా జీవనదాత అయిన జగత్ప్రభువు బాలకిశోరుని దివ్యమూర్తి నా హృదయంలో ప్రభవించుగాక!

-సశేషం

**వేగవంతమైన పంకాలో మూడు ఆకులూ కనిపించనట్లుగా, వేగవంతమైన ధ్యానం ద్వారా త్రిగుణాలు నశిస్తాయి.**

**- బాబూజీ మహారాజ్**

# మౌనధ్యాన సప్తాహశిబిరం

(గతసంచిక తరువాయి) - రమణ ప్రసాద్

భగవంతుడు అవతరించకపోతే మనం మాత్రం ఎందుకు వస్తాము? రాముడున్నప్పుడు కోతులు లేకపోతే ఎలా? గోపాలుడున్నప్పుడు, గోపికలు లేకపోతే ఎలాగ? మనం కూడ ఉండి తీరాల్సిందే. మనం లేకపోతే ఆయన వచ్చి ఏం చేస్తాడు? మనం ధీరత్వం కలిగి ఉండాలి. వారి అవతరణ ఎందు కోసము? మనను ఏడిపించటానికి జీవలక్షణాలతో సృష్టించాలి. జీవలక్షణాలు కలిగి వీడు దేహాన్ని పట్టుకొని బాధ పడుతుండాలి. ఎందుకేడుస్తున్నాడో వాడికే తెలియకుండా ఉండాలి. అప్పుడు, 'అబ్బాయ్! నీవు ఏడ్చేదంతా దొంగ ఏడుపురా' అని చెప్పటానికి వస్తాడు ఆయన. కద. ఎందులో దాగి ఉన్నాడురా అంటే కిటుకంతా ఇందులోనే ఉంది. యుద్ధం చేస్తున్నాంగా ఇప్పుడు ధ్యానానికి కూర్చుంటే, అపరాధమంతా ఎక్కడ ఉన్నది? ఇక్కడి నుంచే వస్తోంది focus(ఫోకస్) అంతా. సలక్షణంగా కన్నుంటేనే చూశామా! గురుదేవుని యొక్క స్వరూపం ఆనందంగా కనిపిస్తోంది. కళ్ళు మూసుకున్నామా! మూసుకోనక్కర్లా, తెరిచి ఉండగానే అటుపక్క ఎవరు వస్తున్నారు, ఇటు పక్క ఎవరు వస్తున్నారు అని చూస్తాము. ఏకాగ్రతతో గురుదేవులను చూసేటప్పుడు పక్కవన్నీ ఎందుకు కనిపిస్తున్నాయి మనకి? అలవాటులో పొరపాటు. అభ్యాసం లేక వాటిమీద ధ్యాస. అందుకని, అటువంటి పరధ్యాసలో పడి అధ్యాస, అజ్ఞానము, అవిద్య, ఇవన్నీ ఒకటే, వాటిలో పడి చిక్కుకొని, శ్లేష్మంలో పడిన ఈగవలె, అలాగే తానే సృష్టించుకున్న సాలె గూటిలో సాలీడు తానే బంధింప బడిపోయినట్లు, మన మనస్సు నుండి వచ్చిన భావవికారాలే మనని బంధిస్తున్నాయి అని మనకు పెద్దలందించారు, సూచనగా. కాబట్టి దానినుంచి లోపలికి రావటానికి ప్రయత్నం చేసే విధానమే . ఎవరికోసం చేస్తున్నాము ఇదంతా? ఎవరికోసం వాళ్ళు చేసుకుంటున్నారు. ఎవరి ఇల్లు చక్కపెట్టుకోవటం కోసంవారు ప్రయత్నం చేస్తున్నారు?

ఈ ప్రయత్నంలో 100% సఫలీకృతం కానిదే ఈ జీవితాన్ని పరిసమాప్తి నొందించటంలేదు. అది ఎప్పుడు చేసుకుంటామనేది మన చేతిలోనే ఉంది. ఈ జీవితం ఉండగానే, శరీరంలో జ్వరాన్ని ఎలా అనుభవిస్తున్నావో, నీవు ఆత్మానుభూతిని అలా పొందాలి అని శ్రీగురుదేవులు మనకు

సెలవిచ్చారు. కాబట్టి ఇది ఉండగానే జరిగి తీరుతుంది. అంతవరకు బ్రతికి ఉండాల్సిందే, నీవు ఏ కష్టాలు పడు. నీవు శీర్షాసనం వేసినా తప్పదు. "కామవరపు జీడిని. వదలి పెట్టను సుమా! నీవు ఇక్కడికి వచ్చి ఆశ్రయించటమేకాని, వదలించుకోవటం నీవల్లకాదు." ఇవన్నీ గురుదేవుల మాటలు సుమా! నేనేదో తాత్కాలికంగా మాట్లాడడంలా. మనం ఎప్పటికప్పుడు మనం ఉన్నటువంటి స్థితిని, మన జీవితాన్ని గుర్తిస్తే మన ఇల్లు ఎంత వరకు చక్కపెట్టు కుంటున్నామంటే, మన అపరాధం మనకే -

**ఉపకార గుణాలయవై ఉన్నావుగదే మాతా**
**అపరాధములన్నీ మరచి ఆదరించవే మాతా**

ఈ పాటపాడుతూ ఉంటే శ్రీగురుదేవులు కూడా ఆనందబాష్పాలు కారుస్తూ ఉండిపోయేవారు.

**తెలిపిలేని అహములతో, తెలియరాని బాధలతో**
**కలతచెందు జీవులమము కనికరించి ఏలుకొనగ ॥ఉప॥**
**ఏనాడో ఎచ్చటనో ఈ నాటక పరి సమాప్తి**
**జ్ఞానమొసగి దారిచూపి దీనులమము దీవింపగ ॥ఉప॥**

మనం స్టేజీ దిగేముందే అటువంటి స్థితిని పొందాలిగదా! ఈ నాటక పరిసమాప్తి పొందకముందే, నాటకం యొక్క రంగు తెలియకపోతే ఎట్లా? అటువంటి జ్ఞానాన్ని ప్రసాదించేదెవరు? తల్లి, తండ్రి, గురువు, దైవము, సర్వమూ తానే అయి, ఏ గురుశక్తి, ఏ పరమమైనటువంటి గురుశక్తి మనకు ఈ స్థానం ఇచ్చిందో, ఇలా జీవితాన్ని నడిపిస్తోందో, దానిని గుర్తించాలి. లేకపోతే ఈ జీవితం ఏమౌతుంది? వృథాకాలక్షేపం. అందుకనే, శివానంద లహరిలో ఒకమాట గుర్తుకు వస్తోంది. ఆది శంకరాచార్యస్వామివారు చెప్తూ..

**గభీరే కాసారే విశతి విజనే ఘోరవిపినే ।**
**విశాలే శైలే చ భ్రమతి కుసుమార్థ జడమతిః ।**
**సమర్ప్యైకం చెతస్సరసిజ ముమానాధ భవతే**
**సుఖేనావస్థాతుం జనఇహ న జానాతి కిమహో ॥**

చాలా చాలా తిరిగి తిరిగి **'గభీరేకాసారే'** కాసారే అంటే చెరువులు, చాలా గంభీరమైనవి, అంటే లోతైనవి. ఇక్కడ కూర్చొని ధ్యానం చేయమంటే కష్టంగాని, వెళ్ళి అక్కడ తామర పద్మాలుంటై అక్కడక్కడ తీసుకొని రా అంటే ఎంత గబగబా వెళ్ళి తీసుకురాగలం మనం!

-సశేషం

# మాతాజీ బోధామృతం

(గతసంచిక తరువాయి) - శివ ప్రసాద్

( శ్రీ సీతా లక్ష్మణ హనుమత్ సమేత శ్రీ కోదండ రామస్వామి వారి ఆలయంలో ది. 28-09-09 శ్రీ మాతాజీవారి అనుగ్రహ భాషణకు సంగ్రహ రూపం)

ప్రపంచంలో ఉన్న సంగతి చెప్తున్నా. ఇవన్నీ రాజకీయంగా, లౌకికంగా మోసం చేసుకోవటం. తెలిసి చేయటం. అర్జునుడు అలా కాదు. తానే, తనలోని దివ్య శక్తిని ప్రేరణ చేసి, తనలోని లోపం గుర్తించాడు. అందుకనే వెంటనే ఢాం అని పాదాలమీద పడిపోయాడు. పడి

**కార్పణ్య దోషోప హతస్వభావః పృచ్ఛామిత్వాం**
**ధర్మ సమ్మూఢచేతాః ।యచ్ఛ్రేయసం**
**నిశ్చితం బ్రూహితన్మే శిష్యస్తేZహం శాధిమాంత్వాం ప్రపన్నమ్॥**

అన్నాడు. అప్పుడు ఒక్కసారి శరణాగతి చెందగానే, తన తప్పును తాను గుర్తించగానే, భగవద్గీత మొదలైంది. ఏది విన్నాడో, ఆక్షణంలోనే దానిని కన్నాడు. ప్రభూ! నీ సర్వ వ్యాపకత్వం వలన, నీ కన్న భిన్నమైనది లేదు, ఆఖరికి నేను కూడా అని తెలిసింది అన్నాడు.

భగవానుడు -

**యత్కరోషి యదశ్నాసి, యజ్జుహోషి దదాసియత్**
**యత్తపస్యసి కౌంతేయ తత్కురుష్వమ దర్పణమ్ ॥**
**అనన్యాశ్చింతయంతోమాం యేజనాః పర్యుపాసతే**
**తేషాం నిత్యాభి యుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్ ॥**

అని చెప్పాడు. నీవు ఏది చేస్తున్నా, దేనిని తెలిసికొంటున్నా, దేనిని అర్పిస్తున్నా, అవన్నీ నాకు అర్పించి చెయ్యి అన్నాడు. మరి మనం అర్పిస్తున్నామా? దోషం అక్కడే ఉన్నది. అలా చేస్తే ఇంక లేనిదేమున్నది. కాని అంతలా ఎవ్వరూ అంతా ఇవ్వలేరు. కొంత నాకు కావాలి. కొంత భగవంతుడికి అని, పూర్తిగా భగవంతుడికి ఇవ్వము. కాని పూర్తిగా వదిలిపెడితే చంకనే ఉంటాము.

పిల్లవాడు అప్పటిదాకా బాగానే ఉంటాడు. కాని అమ్మ బయటకు వెళ్ళటానికి తయారు కాగానే, అమ్మ ఆచ్ వెళ్తున్నది అని చీరపట్టుకుంటాడు. ఇంట్లో ఎవరికి అప్పచెప్పాలి? పిల్లవాడు జాలిగా చూస్తాడు. అమ్మా! ఆచ్, ఆచ్ అంటాడు. తల్లి తూచి, తూచి మాట్లాడుతుంది. తల్లి, బయటకు వస్తే నీవు నడవాలి అంటుంది. సరేనని పిల్లవాడు బూట్లు కూడ తెస్తాడు. తల్లి బూట్లు వేస్తుంది, నడుస్తూ రమ్మన్నదిగా? ఇప్పుడు నడవనంటే, తల్లి పిల్లవాడిని

ఎత్తుకోవాలి. అంతే కాదు, వాడి చెప్పులను కూడ మొయ్యాలి.

నిజమైన భక్తిని ఇచ్చేది, అసలైన వాటిని విచారణ చేసి, మిగిలిన వాటిని వదలి పెట్టటం. అసలైన దానిని పట్టుకోవాలి. అర్జునుడు నాదోషమిది అని సద్గురు దేవుడికి నమస్కారం చేశాడు. అప్పుడు భగవానుడు

**అశోచ్యానన్వశోచస్త్వం ప్రజ్ఞా వాదాంశ్చ భాషతే ।**
**గతాసూన గతాసూశ్చ నాను శోచంతి పండితాః ॥**

అన్నాడు. అర్జునా! పండితుడు ఇటువంటివి విచారించడు. అయినా పండితుడి లాగా మాట్లాడుతున్నావు. జరిగిపోయిన దానిని గురించి కాని, జరుగబోయే దానిని గురించికాని, పండితుడు మాట్లాడడు. ఇప్పుడు జరిగేది మాట్లాడతాడు. ఇప్పుడు సరిగ్గా ఉంటే, ఇంతవరకు జరిగినవన్నీ అందులో ఆహుతి ఔతాయి. ఇప్పుడు సరిగ్గా చేస్తే, శాస్త్రాలన్నీ అతడిని వరించే ఉంటాయి అని చెప్తూ, **యత్కరోషి యదశ్నాసి..... తత్కురుష్వమదర్పణం** అన్నాడు.

కాని మనస్సును వదలిపెట్టలేముగా, అందుకే ఒకాయన, 'మనసు గతి ఇంతే, మనిషి బ్రతుకింతే, మనసున్న మనిషికి సుఖములేదంతే 'అన్నాడు. మనస్సు బయటకు వెళ్తుంటుంది. మనస్సు వెళ్ళినా నీవు దాని వెంట వెళ్ళకు. సంకల్ప వికల్పాలు మనస్సుకు సంబంధించినవి. దాని వెనక నీవు వెళ్ళకు. నీవు దానిని పోషించకు. దానికి మంచి చెయ్యి. మన ఇంటిని మనం చక్కపెట్టుకోవాలి. దేహసౌందర్యం కాదు, ఆత్మసౌందర్యాన్ని గుర్తించాలి. అలా చేశాడు సూరదాస్. గోళకాలలో ఆత్మవస్తువును చూశాడు. లోపలికి వెళ్ళి బుద్ధితో కలసి చూస్తే, ఆత్మానుభూతి కలుగుతుంది.

సముద్రపు లోతు చూడమని, ఉప్పు బొమ్మను పంపితే ఏమౌతుంది? అది అందులో కరిగిపోతుంది. తిరిగిరాదు. నేను ఎవరు? అని సాధన మొదలు పెట్టి, మనస్సులోపలికి వెళ్తే, ఏమౌతుంది? నాకు నిద్రపట్టలేదు అని ఎంత వరకు అంటాము? మనస్సు పని చేస్తున్నంత వరకే. మనస్సును ప్రక్కన పెడితే, నిద్ర కావాలనుకున్నవారికి నిద్ర వస్తోంది. భగవన్నామమందు అనురక్తి కలగాలి. అప్పుడు మనస్సు అందులో లయించి, ముక్తి కలుగుతుంది.

అమ్మ పిల్లవాడికి బూట్లు వేసింది. 'వస్తానన్నావుగా'అని, చెయ్యి పట్టుకొని బయటకు వచ్చి రిక్షా ఎక్కింది. పిల్లవాడు ఎక్కలేదు. వాడు ఎక్కలేడు. వాణ్ణి ఎక్కించాలా వద్దా?అని చూసుకోకుండా ఉంటుందా? తను రిక్షాలోనుంచి దిగి పిల్లవాడిని దింపింది. షాప్ దగ్గర కాలువ అడ్డం వచ్చింది. అప్పుడు తల్లి ఏం చేస్తుంది? పిల్లవాడిని చేయిపట్టుకుని దాటించింది.

-సశేషం

# మాతాజీ సత్సంగ్ డైరీ

(గత సంచిక తరువాయి) -రమణ ప్రసాద్

బాణంతో తన కన్ను తీశాడు. రక్తం వస్తున్న కన్ను స్థానంతో పెట్టాడు. శివుని వంక చూశాడు. రెండవ కన్నులోనుంచి రక్తం కారుతోంది. అయ్యో ఈ కన్ను నుండి రక్తం కారుతోందే అని బాధ పడి శివుని కంటి పైన తన చెప్పుకాలును ఆనవాలుగా పెట్టి రెండవ కంటిని తీసి పెట్టాడు. అప్పుడు శివుడు ప్రత్యక్షమై తిన్నడికి దృష్టిని ప్రసాదించటమే కాక జ్ఞాన చక్షువులను ప్రసాదించాడు. ఈ కన్ను ప్రపంచాన్ని చూడగలదు. జ్ఞాన చక్షువు భగవంతుణ్ణి చూడగలదు. అప్పటినుంచి అతని పేరు కన్నడిగా మారింది. ఎక్కడ వనచరుడు? ఎక్కడ దేవదేవుడు? అతడు చేసిన దేని వల్ల భక్తుడైనాడు? మనసారా భక్తితో పిలిస్తే కాదంటాడా భగవంతుడు? పూజలో ప్రప్రథమంగా 'అపవిత్ర పవిత్రోవా' అని నీళ్ళునెత్తిమీద చల్లుకుని తరువాత ఆచమనం చేస్తాము. అంటే పవిత్రమవుతాం. మనం ధర్మంలోనే ఉన్నాం. మనస్సు ద్వారా దోషం అంటుతోంది. అది పోవాలంటే గురుపాదాన్ని ఆశ్రయించాలి. అందుకని, **'నీ జీవిత నిర్మాతవునీవే, నీ కృషియే ఇల ఫలియించురా।జీవుడిలో శివుడున్నాడురా ఆ శివుడే జగదాధారి రా।'** ఆ శివుడే జగత్తుకి ఆధారం.

భగవంతుడు ఒక్కడే. ఇద్దరు షిరిడి సాయిబాబాలు లేరు. పరమాత్మ దృష్టి అలవర్చుకావాలి. ఇది మా గుడి , అది మా గుడి. మా గుడి పురాతనమైనది అనే భావనలు విడిచిపెట్టండి. **మదిలో కల్లోలము విడరా । మనసున గల దేవుని కనరా।** ఒక్కసారి తల్చుకుంటే చాలు. 'ఝుం'మని మనస్సు భగవంతునిపై నిలిచిపోవాలి.

**నీ జీవిత సమర విహారములోన దీక్షా ధైర్యము జయభేరిరా।** మహాత్ములు సూచించిన మార్గాలు అనుసరిస్తే గమ్యం చేర గలుగుతాం. శివుడు ఎక్కడ లేడు?

కారు ఉంది. ఎక్కేవాడు లేడు. నగలు ఉన్నాయి. పెట్టుకునే వాడు లేడు. ఉన్నా వాటిని లాకర్‌లో భద్ర పరుస్తాము. బ్యాంక్‌కి అద్దె చెల్లిస్తాము. భద్ర పరిస్తే భగవద్వాక్యం భద్ర పరుచుకోవాలి. ఆలోచనా సరళి మంచిగా ఉండాలి. ధర్మ ప్రవర్తన ఉండాలి.

ఒక మహారాజు సభికులను ఇలా ప్రశ్నించాడు. భగవంతుడు ఎక్కడ ఉంటాడు? ఎలా ఉంటాడు? ఏం చేస్తుంటాడు? ఒక బీద పండితుడు ఏదో విధంగా సమాధానాలు చెప్పగలిగితే గొప్ప సన్మానం లభిస్తుంది కదా అని వారం

రోజులు గడువు అడిగాడు. ఇంటికి వచ్చి ఆలోచించటం మొదలుపెట్టాడు. గడువు దగ్గరయ్యేకొద్దీ దిగులుతో చిక్కి సగం అయ్యాడు. అతని వద్ద ఒక నమ్మిన బంటు ఉన్నాడు. 'ఎందుకు మీరు దిగులుగా ఉన్నారు?' అని అడిగాడు. 'నువ్వు ఏం చేస్తావు?' అని పండితుడు అంటాడు.' నేను చెయ్యాల్సిన ప్రయత్నం చేస్తాను.' అని సమాధానం ఇస్తాడు. రాజుగారు అడిగిన ప్రశ్నలను విని 'ఓస్ ఇంతేనా! మీరు నిశ్చింతగా ఉండండి. నన్ను పంపండి నేను సరైన సమాధానాలు ఇచ్చి వస్తాను.'అన్నాడు.

రాజుతో 'నేను పండితులవారి శిష్యుణ్ణి. మీ ప్రశ్నలకు సమాధానం ఇవ్వటానికి వచ్చాను' అన్నాడు. రాజు 'చెప్పలేకపోతే శిక్ష ఏమిటో తెలుసా? శిరచ్ఛేదం' అన్నాడు. బంటు తెలుసునన్నట్లుగా తలఊపి 'ఒక దీపం, ఒక గిన్నె నిండా పాలు తెప్పించండి ప్రభూ! అన్నాడు. అవి తెప్పించబడ్డాయి. సమాధానాలు చెప్పేముందు నాది ఒక షరతు.' అన్నాడు బంటు. అదేమిటంటే ' చెప్పేవాడు పైన ఉండాలి. వినేవాడు క్రిందఉండాలి' రాజు క్రిందకు దిగివచ్చి కూర్చున్నాడు. రాజా! మీ మొదటి ప్రశ్న దేవుడు ఏం చేస్తుంటాడు? అన్నదానికి నా సమాధానం - క్రిందవాడిని పైకి, పైనవాడిని క్రిందకు పంపుతాడు. దేవుడు ఎలా ఉన్నాడు అన్న మీ రెండవ ప్రశ్నకు సమాధానం - పాలు ఉన్న గిన్నెను చూపుతూ ఈ పాలలో వెన్న ఎలానిండి ఉందో అలా దేవుడు అంతటా నిండి ఉన్నాడు. దేవుడు ఎటు చూస్తున్నాడు? దీనికి సమాధానం - ఈ దీపవు కాంతి ఎలా ప్రకాశిస్తోందో, అలా అంతటా చూస్తున్నాడు. సభలో జయ జయ ధ్వనాలు మ్రోగాయి. రాజు పండితునికి. బంటుకి ఘన సత్కారం చేశాడు.

ప్రతి విషయం విచారణ చేసి మనం తీసికొనే భావనను బట్టి ఉంటుంది. తీసికొనేది సద్భావన అయితే సత్ఫలితం ఉంటుంది. ప్రపంచ భావన అయితే దుష్ఫలితం ఉంటుంది. జూదంలో ఓడిన పాండవులు అష్టకష్టాలు అనుభవించారు. కృష్ణుడు అండగా ఉండబట్టి అది తప్పు అని గ్రహించి మంచిస్థితికి వచ్చారు. దుర్యోధనుడు అందులోనే మునిగి పతనమైనాడు. కృష్ణుడు దుర్యోధనుని ఒక మంచి వాడిని వెతికి తెమ్మన్నాడు. అలాగే ధర్మరాజును ఒక చెడ్డవాడిని వెతికి తెమ్మన్నాడు. దుర్యోధనుడికి తనకంటే మంచివాడెవడుంటాడు అనే దృష్టితో వెతికాడు. మంచివాడెవడూ దొరకలేదు. అలాగే ధర్మజునికి తనకంటే చెడ్డవాడెవడుంటాడు అనే దృష్టితో వెతికాడు. ఆయనకి చెడ్డవాడెవడూ దొరకలేదు. ఇద్దరూ ఒట్టి చేతులతో తిరిగి వచ్చారు. యథామతిస్తథా దృష్టిః - మనంచేసే ఆచరణ బట్టి ఉంటుంది. భగవంతుడు నీతోనే ఉన్నాడు. నీ లోనే ఉన్నాడు అనే భావన కలిగి ఉండాలి.

-సశేషం

# శ్రీ బాబూజీ దివ్యవాణి

## అహంకారం పతన హేతువు

సకల జీవకోటి ఆ సర్వేశ్వరుని సంతానం. స్వర్గ, మర్త్యపాతాళ లోకాలలో ఏ లోకానికి చెందినవారైనా సరే, తన బిడ్డలందరి యెడల సమానమైన అనురాగం ఉన్నది ఆయనకు. వైద్యశ్రేష్ఠుడు రకరకాల రోగులకు రకరకాల చికిత్సలు చేసినట్లుగా భగవానుడు తన బిడ్డల మానసిక రుగ్మతలను పోగొట్టడానికి తగిన విధంగా వేర్వేరు చికిత్సా పద్ధతులను అనుసరిస్తాడు. ఒక్క ముక్కలో చెప్పాలంటే తన ధర్మాన్ని నిర్వహించడానికి గాను నామరూప రహితుడైన భగవంతుడు ఏదో ఒక పేరుతో ఏదో ఒక రూపంతో ఈ లోకంలో అవతరిస్తాడు.

భగవంతుడు తన లీలలను సంపూర్ణంగా ప్రదర్శించిన కొద్ది అవతారాలలో కృష్ణావతారం ఒకటి. కృష్ణ భగవానుడు అసంఖ్యాకులైన రాక్షసులను సంహరించాడు. సాధుజనులను ఆదుకున్నాడు. అయితే, సృష్టి కర్త అయిన బ్రహ్మ, త్రిలోకాధిపతి అయిన దేవేంద్రుడులాంటి వారి మనోరుగ్మతలను సైతం నిర్మూలించిన సంఘటనలు మిక్కిలి ఆశక్తికరమైనవి.

గర్వం, అహంకారం అనేవి అతి దుష్టమైన గుణాలు. ఇలాంటి గుణాలు ఎంతటి వారినైనా సరే బుద్ధిహీనులుగా మార్చి వేస్తాయి. అందుకే, బ్రహ్మ, ఇంద్రుడూ ఇద్దరూ కూడా బుద్ధి భ్రంశమై నవ్వులపాలు కావలసి వచ్చింది. దేవలోకంలో దేవతల సంబంధ బాంధవ్యాలు సాలీడు గూడులా అల్లుకుని ఉన్నాయి. విష్ణుమూర్తి, బ్రహ్మదేవుల సంబంధం తండ్రీ కుమారుల సంబంధం. విష్ణుమూర్తి, దేవేంద్రుల సంబంధం అన్న దమ్ముల సంబంధం. రాక్షస సంహారంకోసం విష్ణుమూర్తి భూలోకంలోని నంద గోకులంలో శ్రీకృష్ణుడుగా అవతరించాడని బ్రహ్మకు, దేవేంద్రునకూ తెలుసు. బాలకృష్ణుని లీలను, అతని అద్భుత కృత్యాలు వీరిరువురికీ నిత్యం ఎప్పటికప్పుడు తెలుస్తూనే ఉన్నాయి.

అయినప్పటికీ వీరిరువురికీ వారి వారి ఆధిపత్యంగల రంగాలలో వారి వారి అధికారానికి ప్రాబల్యానికి అంతరాయం కలిగేటప్పటికి వారి స్వాతిశయం దెబ్బతిన్నది. ఎప్పుడైతే గర్వం స్వాతిశయం దెబ్బతింటాయో అప్పుడే అహంకారం ప్రజ్వరిల్లుతుంది. వివేకం మంటగలుస్తుంది. ఎప్పుడు అవకాశం లభిస్తుందా ఎప్పుడు ఆవహించి ఆధీనం చేసుకుందామా అని మాయ

ఒకమూల ఎల్లప్పుడూ పొంచి ఉంటుంది. ఈ మాయా ప్రభావం అంతా యింతా కాదు. భగవంతుడంతటివాడు దీని ప్రభావానికి లోనై తలక్రిందులు అవుతుంటాడు. ఇంకేం? ఇప్పుడు బ్రహ్మదేవుడికీ, ఇంద్రుడికీ అదే పట్టింది.

కృష్ణుడి లీలలను గురించి ఎంతగానో విన్న బ్రహ్మదేవుడికి విషయం తెలుసుకోవాలన్న ఆరాటం హెచ్చింది. నందగోకులంలో ఏం జరుగుతున్నదీ స్వయంగా చూడాలని భూలోకంలోకి వచ్చాడు. అయిదేండ్ల బాలుడు గోపాలుడు. నల్లనివాడు. నెత్తిన నెమలిపింఛం, చేతిలో పిల్లనగ్రోవి. నందగోకులం అంతటికీ నాథుడుగా వెలుగొందుతున్నాడు. జగన్మోహనాకారంతో, అతిలోక సౌందర్యంతో మధుర మంజుల వేణుగానంతో స్త్రీలు, పురుషులు, బాలురేకాదు, గోగణాన్ని కూడా సమ్మోహితం చేస్తున్నాడు. చూశాడు బ్రహ్మ దేవుడు.

శ్రీ కృష్ణుడి దివ్యలీలలన్నిటికీ నిలయమైన పావన బృందావనంలో ప్రవేశించాడు బ్రహ్మ. అక్కడ చిన్నికృష్ణుడు యమునా తీరంలో గోప బాలురతో కలసి చల్దులారగిస్తూ ఉండడం చూశాడు. ఏ జగన్నాథుడు ప్రపంచం అంతటికీ ఆహారం ప్రసాదిస్తున్నాడో! ఏ భగవానుడి దర్శనం దివ్య లోకాలలో దేవతలకు సైతం దుస్సాధ్యంగా ఉంటున్నదో అలాంటి భగవంతుడు ఇప్పుడు, ఇక్కడ, తన ప్రక్కన కూర్చున్న గోపబాలుడి చేతిలో ఎంగిలి పెరుగన్నం ముద్దలందుకో బోతున్నాడు. తన చేతిలోని ముద్దను మరొక గోపబాలుడికి తినిపిస్తున్నాడు. ఈ గోపబాలురు ఎంతటి అదృష్టవంతులు! ఎంత అద్భుత, అపురూప దృశ్యం ఇది! చతుర్ముఖుడైన బ్రహ్మకు ఎనిమిది కళ్ళూ చాలలేదు ఈ దృశ్యం చూడడానికి!

అయినా, బ్రహ్మదేవుడు తృప్తి పడలేదు. కృష్ణుడి లీలా విశేషాలు మరికొన్ని చూడాలనుకున్నాడు. అంతవరకూ బాగానే ఉన్నది. కాని, 'ఈ చిన్ని బాలుణ్ణి పరీక్షించి చూద్దాం, అని ఎప్పుడైతే అనుకున్నాడో, అప్పుడే బ్రహ్మదేవుడిలో అహంకారం తలఎత్తింది. పచ్చిక మేస్తున్న గోవులు, గోవత్సములు అప్పటికే దూరంగా వెళ్ళిపోయాయి. వాటిని మాయం చేశాడు బ్రహ్మ.

బ్రహ్మదేవుడికి, దేవేంద్రుడికి గర్వభంగం చేసి, వారిని ఆవహించిన అజ్ఞానాన్ని తొలగించడం కోసం బాలకృష్ణుడు చక్కటి పద్ధతులు ఎలా అవలంబించినదీ శ్రీ కాళీ గార్డెన్సులో శ్రీ హనుమత్‌కాళీ వరప్రసాద బాబూజీ మహరాజ్ వారు ఎంతో మనోహరంగా భక్తులకు ప్రవచించారు. *

# సమర్థ సద్గురు నాథుని దివ్య చరిత్ర

(గత సంచిక తరువాయి) - విజయేశ్వరానంద ప్రసాద్

మండువా లోగిలి యింటి అరుగుపై జరిగే సమావేశాలలో, వారి వారి ప్రశ్నలకు సమాధానాలే కాకుండా, భగవంతుణ్ణి గురించిన ఎన్నో విషయాలు శ్రీబాబు చెప్పేవారు. బాగా చదువుకున్న పండితులు కూడా ఒక్కొక్కసారి వచ్చేవారు. వారితో శ్రీబాబు జరిపిన సుదీర్ఘ చర్చలను, ఆ పండితులు కూడా ఆశ్చర్యపడే విధంగా శ్రీబాబు వెల్లడించిన వేదాంత రహస్యాలను విన్నవారు, శ్రీబాబు ఎంతో చదువుకున్నవారని, టక్కుటమార విద్యలు నేర్చిన పొట్టకూటి సాధువు కాదని గ్రహించారు. శ్రీబాబు తానేమీ చదువుకోలేదని, జగన్మాత ఏది అనుగ్రహిస్తే దానినే వెల్లడిస్తున్నానని, తాను నిరక్షరకుక్షినని చెప్పేవారు. దీనిని బట్టి శ్రీబాబు ఎవరి వద్దా ఏమీ నేర్చుకున్నట్లు లేదని, బాల్యంలోనే యే హిమాలయాలకో వెళ్ళి, ఎంతో తపస్సు , ధ్యానము, సాధన చేసి, స్వయంగా సిద్ధిని పొందిన మహనీయులని ఆ గ్రామవాసులు నిశ్చయించుకున్నారు.



కోరుకొల్లులో ఉన్నపుడు శ్రీబాబు ప్రతిరోజూ అర్ధరాత్రి దాటిన తరువాత ఎవరూ లేవక ముందు, పద్మాసనం వేసి కూర్చుని, చలికాలంలో కూడా, ఒక చల్లని నీళ్ళ కుండను ఒడిలో పెట్టుకొని, దానిని తమ పొట్టకు, నాభికి తగిలేటట్లుగా ఆనించుకొని రాగాలాపన చేసేవారని, అలికిడి లేకుండా లేచి తాము ఆ గంధర్వగానం విని మైమరచిపోయేవారమని, కృష్ణంరాజుగారు చెప్పారు. భీమవరం, దిరుసుమర్రు తదితర గ్రామాలకు తాము వెళ్ళినప్పుడు ఎక్కడైనా తమకు ఆ రాగాలాపన వినిపించినంతనే వారి మనస్సు అటువైపు లాగేదని, అక్కడ శ్రీబాబు ఉన్నారని గ్రహించి ఆ గృహంలోకి వెళ్ళి చూస్తే, అక్కడ తప్పక శ్రీబాబు దర్శనం అయ్యేదని కృష్ణంరాజుగారు చెప్పారు.

అలాగే ఒకసారి ఎవరింట్లోనో శ్రీబాబు పాట వినబడుతుంటే కృష్ణంరాజుగారు ఆ యింటిలోనికి వెళ్ళారు."వచ్చావా గోపాలకృష్ణా ! రా!

రా!''అని శ్రీబాబు పిలిచారు. కృష్ణంరాజుగారు శృంగార పురుషులు. అందుకని ఆయన ఉడుకుమోతు తనంతో "ఇంకా నీ తుంటరి తనం పోలేదు బాబూ'' అనేశారు. తరువాత, అక్కడ ఎందరో కొత్తవారి ముందు శ్రీబాబుతో అలా మాట్లాడినందుకు చాలా పశ్చాత్తాప పడ్డారు. శ్రీబాబు మాత్రం నవ్వేసి ఊరుకున్నారు.

అప్పటి నుంచి, శ్రీబాబుతో తన అనుబంధము కృష్ణ కుచేలుర అనుబంధము వంటిదనే భావము మాటిమాటికి తనకు కలిగేదని, అలా కలిగినప్పుడల్లా తన శరీరము గగుర్పొడిచేదని, యిప్పటికీ ఆ మధుర భావన కలిగినప్పుడల్లా ఉప్పొంగిపోతూ ఉంటానని శ్రీ కృష్ణంరాజుగారు చెప్పారు. శ్రీబాబు ఆయనలో అంతటి పరివర్తనము కలిగించారు. ఆశ్రిత జన వాత్సల్యమంటే అదే కదా!

కృష్ణంరాజు గారి అభిప్రాయం ప్రకారం, శ్రీబాబు మొదటిసారి కోరుకొల్లు రావటం సుమారు 1940 - 41 ప్రాంతంలో జరిగి ఉండవచ్చును.

## యనమదుర్రు

పశ్చిమ గోదావరి జిల్లాలో భీమవరం పట్టణానికి సమీపంలో యనమదుర్రు గ్రామం ఉంది. ఆ ఊరికి మూడు వైపుల పొలాలు, నాల్గవ వైపున కాలవ గట్టు వెంబడి కాలి బాట ఉన్నాయి. ఆ కాలవ గట్టు మీద నుంచి ఊళ్ళోకి రావటానికి, మధ్యలో ఉన్న పంట కాలువ మీదుగా చిన్న వంతెన దాటాలి. ఆ ఊరికి శ్రీబాబు వచ్చినప్పుడు ముందుగా పరిచయమైన వ్యక్తులు మేకల రత్నమ్మగారి కుమారులు మాణిక్యంగారు, తాతయ్యగారు, అప్పారావుగారు. వారి పెద తండ్రిగారి కుమారుడు సూర్యారావు గారు.

ఒకరోజు సూర్యారావుగారి యింటివద్ద మాణిక్యంగారు, అప్పారావుగారు, సూర్యారావు గారు, మాణిక్యం గారి మేనల్లుడు పండుదొర గారు మాట్లాడు కుంటున్నారు. అంతలో సన్నగా, చామనచాయగా, సిల్కు బట్టలు వేసుకొని, మెడలో చిరుగంటల గొలుసు, చెవులకు పోగులు, ముక్కుకు కాడ, చేతులకు బంగారు గొలుసులతో, జ్యోతులవంటి కళ్ళతో, తేజోవంతుడైన ఒక యువకుడు పొలాల వైపు నుంచి వచ్చాడు. "ఎవరండి మీరు?'' అని మాణిక్యం గారు అతనిని అడిగారు. ఆ యువకుడు ఆ ప్రశ్నకు జవాబు చెప్పక, "మీ అన్నగారు భీమవరంలో మామిడిపళ్ళు కొంటున్నారు.'' అన్నాడు. "ఈ కొత్తాయనకు మా అన్న ఎలా తెలుసు? ఇతడు చూడబోతే, యీ ప్రాంతం వాడి వలె కనబడటం

లేదే? ఈయన ఏమైనా మహాత్ముడా?'' అని వాళ్ళు తర్జన భర్జన పడుతుండగానే, వాళ్ళ అన్నగారైన తాతయ్యగారు వచ్చారు."అన్నయ్యా? మీరు భీమవరంలో మామిడి పళ్ళు కొన్నారా?'' అని వాళ్ళు అడిగారు. "అవును కొన్నాను, ఆ సంగతి మీకెలా తెలుసు? ఎందుకలా అడిగారు?'' అని తాతయ్యగారు అంటే, "ఈయన ఎవరో యిప్పుడే వచ్చి మాకీ విషయం చెప్పారు'' అని వాళ్ళన్నారు. తాతయ్యగారు ఆశ్చర్యంగా "నేను మిమ్మల్ని ఎప్పుడూ చూసినట్లు లేదే? మీరు మమ్మల్ని యింతకు ముందే ఎరుగుదురా?'' అని ఆ యువకుణ్ణి అడిగారు. "మా జగన్మాత నాకు చెప్పింది.'' అన్నాడా యువకుడు. "పేరేమిటి?'' అని వారడిగారు. "నేను ఊరూ పేరూ లేని వాణ్ణి. 'బాబు' అని పిలుస్తుంటారు నన్ను'' అన్నాడా యువకుడు.

"ఈయన ఎవరో జగన్మాత భక్తుడై ఉంటాడు'' అనుకొని వాళ్ళు "యిలా దయ చేయండి'' అని శ్రీబాబును సూర్యారావుగారింటికి తీసుకుని వెళ్ళి, అరుగు మీద చాప వేసి, "కూర్చోండి'' అన్నారు. ఉత్తరీయంతో కప్పుకొని ఉన్న ఆయన చేతిలో పులిచర్మంతో చేసిన ఒక పెట్టెను, చూసి, "అదేమిటి?'' అని అడిగారు వాళ్ళు. దానిని తన హృదయానికి హత్తుకుంటూ, "ఇది నా దేవతార్చన'' అన్నాడా యువకుడు. "అది ఇంట్లో పెట్టుకొని వద్దురుగాని రండి'' అని యింటి లోపలికి ఆహ్వానించారు సూర్యారావుగారు. "వద్దు లెండి. శుచిగా, శుభ్రంగా ఎవరూ తాకని ప్రదేశంలో దీనిని ఉంచాలి. మీకు ఆ శ్రమంతా ఎందుకు?'' అన్నాడా యువకుడు. "శ్రమ ఏమీ లేదు. తమకు పరిశుభ్రమైన ప్రదేశమే చూపిస్తాను'' అని సూర్యారావుగారు ఆ యువకుని తమ యింటిలోనికి తీసుకొని పోయి, ఈశాన్యం వైపున ఉన్న దేవతార్చన గదిలో పీట వేసి, దేవతార్చన పెట్టెను పెట్టించారు. తరువాత వాళ్ళిద్దరూ మళ్ళీ అరుగు మీదకు వచ్చి కూర్చున్నారు. ఆ యువకుడే శ్రీ బాబు.

-సశేషం

**వడ్లగింజపై పొరలు తొలగిస్తే, బియ్యపుగింజ తిరిగి మొలకెత్తదు. అలాగే అహంకారం,మమకారం అనే పొరలు తొలగిన మానవునికి పునర్జన్మ లేదు**

**- శ్రీబాబూజీ మహరాజ్**

# అమెరికాలో శ్రీ మాతాజీ

(గతసంచిక తరువాయి)

**(ది. 12.06.2010 న్యూజెర్సీ, అమెరికాలో శ్రీ మాతాజీ వారి అనుగ్రహ భాషణ సంగ్రహరూపం)** **-శివప్రసాద్**

ధ్యానానికి ఒక అనుష్ఠానం పెట్టుకో నాయనా. రాత్రి పెందరాళే పడుకో. తెల్లవారుజామున లే. లేదూ పనులన్నీ చేసికొని రాత్రి ధ్యానం చేసుకో.ఆ తరువాత పడుకో. కాని ధ్యానం అన్నా మానతాడేమో గాని, భోజనం మానడు మానవుడు. ధ్యానానికి సమయం కుదరటం లేదండీ అంటారు కొంతమంది. ధ్యానం చేయని రోజు భోజనం చేయననే నియమం పెట్టుకో. గురుదేవులు అనేవారు, "తెల్లవారుజామున లేవలేకపోతే రాత్రి 12 గంటలకు చక్కగా కాళ్ళు కడుక్కొని ధ్యానానికి కూర్చో. లేకపోతే హాయిగా స్నానం చేసి ఫ్రెష్‌గా తయారై ధ్యానం చేసుకో. ఆ తర్వాత పడుకో. అప్పుడు హాయిగా నిద్ర పోతావు"అని.

ప్రశాంతత అనేది కొని తెచ్చుకొనేది కాదు. టీ.వి సీరియల్ చూస్తే రిలాక్స్ అవుతామనుకొంటారు. అందులో చూసే దృశ్యాలకు బి.పి వస్తుంది.

నువ్వు ఏ దేవుణ్ణి అర్చిస్తే ఆ దేవుడే. ఆ దివ్యమైన వస్తువు దేవునిలో లేదు. ఈ దివ్యమైనది నువ్వే అని గుర్తింపచేస్తాడు గురుదేవుడు. అక్కడనుంచి వచ్చే దివ్యశక్తిని మనం గుర్తిస్తాం.

ఇంట్లో పెద్దకూతురు ABCD లు దిద్దుతుంటే చిన్నదికూడా నేర్చుకుంటుంది. మనం కూడా అటువంటి సహవాసాన్నే పట్టుకుంటే automatically మన సమయం కూడా సద్వినియోగపడుతుంది.అదే జ్ఞానమంటే.నిరంతరం దేనిమీద ధీ - బుద్ధి; యానం -ఆ మార్గాన్ని అనుసరిస్తుందో అది ధ్యానమైంది.

గురుదేవులు ఒక భక్తురాలని ఒక పాట పాడమన్నారు. ఆమె 'నీ వుండేదాకొండపై , నా స్వామి నేనుండేదీనేలపై' అనే పాట పాడింది. గురుదేవులు " అంటే ఆయన కొండమీద ఉంటే నువ్వు నేలమీద ఉన్నావా? అంటే ఆయన నేల మీద లేడా? లేక నువ్వు కొండ మీద లేవా? భక్తుడు లేని భగవంతుడు ఎక్కడనుండి వచ్చాడు? భగవంతుడు లేని భక్తుడు ఎక్కడనుండివస్తాడు?" అన్నారు. గురుదేవులు అలాంటి సూచనలను అందిస్తారు.

ఆత్మ స్వరూపం మనది. అది నిత్యము సత్యము అయిన చైతన్య స్వరూపం. ఎప్పుడూ ఆనందదాయకమైనది. దానిని గుర్తించటంలా. అసలు సహజ లక్షణాలు గుర్తించటంలా.మనసుల్లో చెత్త, చెదారం పెట్టుకుంటున్నాము. మనస్సు

ఖాళీగా పెట్టుకోవటం చేతకావటం లేదు.మనస్సులో ఎన్నో ఊహలు పెట్టుకుని ధ్యానానికి కూర్చుంటున్నాము. అవే రీల్స్ లాగా ధ్యానంలో వస్తాయి. కాలు తిమ్మిరి రూపంలో నిన్ను ధ్యానం నుండి లేపటానికి ప్రయత్నిస్తుంది నీ మనస్సు. అభ్యాసం కూసువిద్య అన్నారు. మనస్సు మాట లెక్కపెట్టకుండా నీ ధ్యానాన్ని కొనసగించు.

ఆది శంకరాచార్యులవారు మన జీవితాలకు దారి చూపించటానికి ఎంత శ్రమ పడ్డారు? అలాగే రామకృష్ణ పరమహంస, స్వామి వివేకానంద, మీరా , సక్కుబాయి, సమర్థ రామదాస స్వామి,ఇంకా ఎందరో మహాత్ములు మనకు మార్గ దర్శకులుగా నిలిచారు. వారిని అనుసరిస్తే చాలు. మన జన్మలు మూడు పువ్వులు, ఆరు కాయలవుతాయి. మూడు పువ్వులు, ఆరు కాయలేమిటి? ఒక్కొక్క పువ్వుకి ఆరు కాయలు - ఎప్పుడు? ఎనలేని గురుపాదాన్ని ఆశ్రయించి అర్థం చేసికొన్ననాడు. ఆయనను అవగాహన చేసికొన్ననాడు. అవ్యక్తాన్ని తెలియచేయటం కోసం ఒక వ్యక్త రూపం ధరించి మన ముందుకొచ్చింది. అలా వ్యక్తంగా వచ్చి, మనకొక మనస్సును పెట్టి భగవంతుడు తనని గుర్తించమన్నాడు. అది గుర్తించిననాడే **-గురి తప్పని నిజ దృష్టికిగురుతేతానన్నది** - గురి తప్పని నిజదృష్టికి గుర్తు ఎవరు? తానే! దానిని పొందింపచేస్తుంది గురుపాదం. వారి ఆశ్రయాన్ని మనం పొందగలిగాం. గురితప్పని నిజదృష్టి ఎక్కడ? అంటే ఇక్కడే! దానివలననే ఈ కొద్ది సమయం మనం కదలకుండా ధ్యానంలో కూర్చోగలిగాం. ధ్యానానికి పద్మాసనంవేసికొని కూర్చో. లేదా వజ్రాసనంలో కూర్చో. క్రింద కూర్చోలేకపోతే కుర్చీలో కూర్చో. లేదా గోవిందాసనం వేసుకో - అంటే పడుకొని ధ్యానం చెయ్యటం. దేహం కదలకూడదు. మనస్సు కదలకూడదు. మనస్సు కదిలితే దేహం కదులుతుంది. అందుకే భద్రం కర్ణేభిః; భద్రం పశ్యామి - అన్నారు. కళ్ళు చూశాయి. చెవులు విన్నై ఆ శబ్దాన్ని. మంగళకరమైన శబ్దాలు వినాలి. ఇతర శబ్దాలు కాదు. లేకపోతే గమ్యస్థానాన్ని చేరలేము. ధ్యానంలో నిద్ర పోకూడదు. హాయిగా కూర్చుని మనస్సును ఏకాగ్రం చెయ్యి. దానిని పరిశీలించు. అప్పుడు నిద్ర వస్తుంది అయినా పరవాలేదు.

Ticket కొనుక్కుని Flight ఎక్కాం. ఎవడో ఫోన్ చేశాడు. అందులో బాంబు ఉన్నదని.అప్పుడు ఇంకా takeoff అవలేదు అని చూస్తామా? తలుపులు తీస్తే బయటపడదామని చూస్తామా? ఇంతకీ ఎవరూ బాంబు పెట్టలా ఎవడో ఆట పట్టించటానికి ఫోన్ చేశాడు. అయినా భయమే చస్తామని. మృత్యువు దేహానికి వస్తుంది. ఆత్మకు రాదు. కరెంట్ పోతే ఏమౌతుంది? లైట్లు ఆరిపోతాయి. అలాగే మనం కూడ. ఇంత ఖాళీ (space)ఉంది. ఈ ఖాళీలోకి మనం వచ్చాం. దేవుడు

మనకి దేహాన్ని ఇచ్చి అందులో ప్రాణం పోశాడు. రాకడ, పోకడ అనేవి వచ్చాయి. మన దేహాలకు విలువ లేదు. space కే విలువ. మనం చూస్తున్నాం. ఇప్పుడు ఇంటికి విలువ లేదు. స్థలానికే విలువ. ఒకనికి వృద్ధాప్యం వచ్చింది. భార్య, బిడ్డలు,బంధువులు మొహం చాటేశారు. రోగంతో బాధ పడుతూ పోయాడు. ఆ తాతయ్యని పడుకోబెట్టారు. ఆయన మనుమరాలు వచ్చింది. తాతయ్య ఇక్కడే ఉన్నాడుగా. మరి పోయాడం టారేమిటి? లేదమ్మా పోయాడు ఆంటారు పెద్దవాళ్ళు. మరి ఉన్నది ఏది? పోయిది ఏది. పోయేది ఈ దేహం. అది జడం. నీలో ఏది ఉంటే పనులు చేయగలుగుతున్నావో అది ప్రాణం. ప్రాణం పోతే చనిపోయాడు అంటాం.ప్రాణరూపంలో ఉన్న అవ్యక్త శక్తి. అదే ఆత్మ అన్నారు. అదే చైతన్యం అన్నారు. దేహంలో కన్ను లేకపోయినా, చెవి లేకపోయినా మనం ఉంటాం. ఆఖరికి బ్రైన్ పనిచెయ్యకపోయినా మనం ఉంటాం. కోమాలోకి వెళ్ళాడు అంటాం. కాని గుండె కొట్టుకోవటం ఆగితే పోయాడు అంటాం. పూర్వ కర్మల ఫలితంగా మళ్ళీ జన్మకొస్తాం. దీనినే శ్రీ శంకరాచార్యులవారు చెప్పారు -

**పునరపి జననం, పునరపి మరణం**
**పునరపి జననీ జఠరే శయనం**
**ఇహ సంసారే బహు దుస్తారే**
**కృపయా పారే పాహి మురారే**

గురుదేవులు ఈ శ్లోకాన్ని చాలాసార్లు తమ బోధలో ఉగ్గడించేవారు. పునర్జన్మ ఉందని ఇప్పుడు అందరూ నమ్ముతున్నారు. పాశ్చాత్యులు కూడా నమ్ముతున్నారు. అమెరికా ప్రెసిడెంట్‌ను టి.వి లో చూస్తాం. అతడక్కడ చెయ్యి ఆడిస్తే ఇక్కడ మనం చూడగలుగుతున్నాం. మంచి దృష్టితో పోతే జీవన్ముక్తస్థితి వస్తుంది. కర్మలతో పోతే జన్మ వస్తుంది. కుండ బ్రద్దలైపోతే ఇంకో కుండ వెతుక్కోము. అలాగే ఈ జీవితం పోయి మరో జీవితం వస్తుంది. ఆ వచ్చేది మానవజన్మ అనే గ్యారంటీ లేదు.

మంచి గుర్తుతో ఉంటూ ఎవరు ఏ భగవంతుణ్ణి ఆశ్రయించారో, ఆ భగవతత్త్వాన్ని స్మరిస్తూ, స్మరణ ఉన్నచూట మరణం లేదు కాబట్టి, భగవన్నామాన్ని చేస్తూ, మరణం మానవదేహానికి ఉంది అనిగుర్తించి, అమృతత్త్వాన్ని మనం అనుభవిస్తుంటే, అటువంటి గురుకృప, సద్గురుదేవుల అనుగ్రహానికి మనం పాత్రులమవుతాం. అనుభవం మనదవుతుంది. మనం ఆనంద స్వరూపులమే. మనం ఎప్పుడూ భగవన్నామాన్ని చేస్తూ, భగవంతుణ్ణి గురించి విచారణ చేస్తూ ఉంటే మన జీవితాలను చక్కగా సార్థకం చేసికొవచ్చు. అటువంటి శక్తిని, భక్తిని,సాధనా సంపత్తిని శ్రీ గురుదేవులు మనకు ప్రసాదించెదరు గాక సుఖీభవ! సుఖీభవ!!

# ముక్త జీవి శ్రీమతి పాందువ్వ కమలమ్మ

-విజయేశ్వరానంద ప్రసాద్

"ఏవేవో ఆపరేషన్ల పేరుతో నా పొట్ట అడ్డంగా, నిలువుగా ఎన్నిసార్లు కోశారో! నా బొడ్డు నాకే కనపడలేదు. అక్కడ ఉండే మణిపూరక చక్రం వాళ్ళకేమైనా కనపడిందేమో అని అడిగితే కనపడలేదన్నారు" అని పకపకా నవ్వేసింది కమలమ్మ. కానరాని, అంతు చిక్కని వ్యాధితో ఎన్నాళ్ళనుంచో సతమతమవుతున్నా, తన శరీరాన్ని దాని బాధకు దాన్ని వదిలివేసి, దానితో తనకు నిమిత్తం లేనట్లు విలక్షణంగా ఉండగలిగిన అరుదైన వ్యక్తి పాందువ్వ కమలమ్మ.

అటు పుట్టింటా, యిటు మెట్టినింటా కూడా వేదాంత విచారణ వాసనకైనా తగలక పోయినా, ఎన్ని పూర్వ పుణ్య జన్మల సంస్కారమోగాని, ఆమె నిరంతరమూ తత్త్వ విచారణ అంటే చెవి కోసుకునేది. ఎంత శ్రమకైనా ఓర్చి అటువంటి చర్చ జరిగే చోటికి వెళ్ళి, ఎంత సేపైనా కూర్చొని, ఆకలిదప్పులు కూడా మరచి, ఆసక్తితో విని, విన్నదానిని చక్కగా మననం చేసుకుని, తనదైన శైలిలో దానిని వ్రాసుకుని, ఆ ఆసక్తిగలవారితో దానిని గూర్చి మాట్లాడుకోవటమంటే, ఆవిడకు విందు భోజనం కంటె పసందుగా అనిపించేది.

కనుకనే కేవల పరతత్త్వ స్వరూపులైన శ్రీబాబూజీ మహరాజ్‌వారి దివ్య సన్నిధిలో ఆమె చెరగని చోటు సంపాదించుకున్నది. సన్నిధిలో చోటే కాదు ; గురు పాదములకే పుట్టుమచ్చవలె అవిభాజ్యంగా అతుక్కుని పోయింది. అంతే కాదు ; చివరికి ఆ పరబ్రహ్మ స్వరూపునిలో స్వరూపలయం పొందింది.

పశ్చిమ గోదావరి జిల్లా కోలమూరు గ్రామంలో పుట్టి, పాందువ్వ గ్రామంలో కునాథరాజు వారిల్లు మెట్టి, గోపాలరాజుగారి సతీమణిగా సేవ చేసుకుంటూ, యిద్దరు కుమార్తెలకూ ఒక కుమారునికీ జన్మనిచ్చి, సమర్థ సద్గురు దేవుల దివ్యపాదం పట్టి, జ్ఞాన పిపాసువై, సభర్తృకంగా ఆశ్రమ నివాసియై, శ్రీగురుదేవుల వద్ద మంత్ర దీక్షను పొంది, సాధన పారమ్యాన్ని చేరుకుని, **"మూలాభావ మిదం జ్ఞాతం। శరీరం నాస్తి కేవలమ్ ।**

**స్వప్నే ప్రతీయ మానాని రూపాని యధా తధా । అయం బాహ్య వ్యర్థః । కో ऽపి న భవతి ।"** అనే పరిపూర్ణ ఆత్మానుభవాన్ని ఆస్వాదించి, కేవలాత్మ స్వరూపిణిగా శాశ్వతత్వాన్ని పొందింది. శ్రీగురు లక్ష్యసాధనలో ఆచరణ శూరులనిపించుకున్న ఆ పుణ్య దంపతులను చూసి శ్రీగురుదేవులెంతో ఆనందిస్తూ, తమ కంఠసీమనున్న పుష్పహారమును తీసి, దానితో వారివురినీ కలుపుతూ 'దండించే'వారు. అంతేకాదు ; వారిరువురికీ సజీవంగానే ఆత్మారాధన చేసుకునే మహదవకాశాన్ని కల్పించారు.

శ్రీబాబూజీ కమలమ్మను 'మీ అత్తయ్య' అంటూ చిన్నప్పుడే పూజ్య శ్రీమాతాజీకి పరిచయం చేశారు. ఆ దంపతులు శ్రీమాతాజీలోనే శ్రీగురుదేవులను దర్శించుకుంటూ పరితృప్తులై ఉండేవారు. వ్యాధి నిమిత్తంగా ఆశ్రమంలో తుదిక్షణాలలో ఉన్న కమలమ్మ వద్దకు శ్రీమాతాజీ స్వయంగా వెళ్ళి, దివ్యబోధ నందించి, ఆమెకు శ్రీ బృందావనంలో శ్రీబాబు దర్శనం చేయించి, శ్రీగురుపాద తీర్థంతో ఆమెకు ప్రసాదించిన ప్రతిలేని చిత్తోపరతి సుఖాన్ని అనుభవిస్తూ, ఆచరితార్థ జీవి కమలమ్మ 25-8-2010 నాడు శ్రీగురు సాయుజ్యం పొందారు.

'కమల అనే పేరు వచ్చింది, పోయింది ; కాని అప్పుడూ, యిప్పుడూ, ఎప్పుడూ ఆమె రాకడ పోకడలేని శాశ్వత పరబ్రహ్మ స్వరూపమే' అనే దృఢ నిశ్చయంతో స్థిత ప్రజ్ఞులై ఉన్న గోపాలరాజుగారు శ్రీగురు సోదరీ సోదరులందరికీ ఆదర్శప్రాయులు ; సదా వందనీయులు.

*

వారి కుటుంబ సభ్యులపై శ్రీగురుదేవుల దివ్యాశీస్సులు సదా వర్షించుగాక!

**"శశ్వన్నశ్వరమేవ విశ్వమఖిలం నిశ్చిత్య వాచాగురోః ।**
**నిత్యం బ్రహ్మ నిరంతరం విమృశతా నిర్వ్యాజ శాంతాత్మనా।**
**భూతం భావిచ దుష్కృతం ప్రదహతా సంవిన్మయే పావకే ।**
**ప్రారబ్ధాయ సమర్పితం స్వవపు రిత్యేషా మనీషా మమ ॥"**

(-మనీషా పంచకము)

# సాధకుడు

-డా॥ వెంకటరమణ ప్రసాద్

24.08.10న గురు సాయుజ్యాన్ని పొందిన శ్రీగూడ.శివ రామ మూర్తి గారు మహామనీషి. బాల్యంనుండి ఆయన విద్యా విషయంలో సాధించిన ప్రథమ శ్రేణులు, బంగారు పతకాలూ లెక్కకు అందనివి. షార్టు హ్యాండు రాయటంలో రాష్ట్రంలో ప్రథమస్థానాన్ని పొందిన మూర్తిజీ, 70 ఏళ్ళ వయస్సులో సంస్కృత పరీక్షలలో పాల్గొని రాష్ట్రంలో ప్రథమస్థానాన్ని పొందటం విశేషం. ఆయన ప్రజ్ఞకు ఈ సంఘటనలు చిహ్నాలు మాత్రమే.

కాని లౌకిక ప్రజ్ఞ నిజంగా ప్రజ్ఞే కాదు. మనిషి మరణంతో ఆతడు సాధించిన లౌకిక విజయాలు కూడ తెరమరుగౌతాయి. ఒకనాడు రాయల చేత "ఎదురైనచో తన మదీ కరీంద్రము నిల్పి కేలూత యొసగి" ఎక్కించుకొన బడిన అల్లసాని పెద్దనుగాని "దీ నారటంకాల తీర్థము"లాడిన శ్రీనాధుడినిగాని యీతరంవారు గుర్తుంచుకోవటంలేదు. ఇక ఇతరుల మాట చెప్పనేల?

లౌకికంగా శ్రీ G..S.R. మూర్తిగారు అపార ప్రతిభావంతులని చెప్పాం. ఆ విషయం ఆయన అప్రతిహతంగా నిర్వహించిన ఇ.సి.ఐ.ఎల్ కంపెనీ సెక్రటరీ పదవే నిరూపిస్తుంది. కాని ఆయన ఉద్యోగం చేస్తూ కూడ ప్రతిరోజు జీవన ధ్యేయాన్ని గురించి ఆలోచించేవారు. ఆయన బుద్ధి తర్కకర్కశమైనది. ఆయన ఆలోచనా శైలికి విశ్వనాథవారు వరవడి. జీవించటానికి ఉద్యోగం చేయాల్సిందే ; కానీ జీవన ధ్యేయం అదే కాదు. మానవుడు తాను తన అమృతత్వాన్ని గుర్తించి, తనను బంధించే లౌకిక బంధాలనుంచి విముక్తుడు కావటమే జీవన ప్రయోజనమని భావించిన సద్భావనా విలసిత సునిశిత కుశాగ్ర బుద్ధి ఆయన.

అలా మేధో పాథోనిధి' యైన మూర్తిగారు ఒకమారు తమ ఆఫీసుపని మీద బొంబాయి వెళ్ళవలసి వచ్చింది. అక్కడ జరుగుతున్న శిక్షణా కార్యక్రమంలో పాల్గొనటానికి ఆయన దాదాపు ....... కాలం ఉండవలసి వచ్చింది. ఆఫీసు పని 1.00గం॥ నుండి 5గం॥ల వరకు ఉదయం అంతా ఏం చెయ్యాలా అని ఆలోచిస్తున్న ఆయనకు ఒక ముఖ్యవిషయం తెలిసింది. ఆయన ఆ విషయం విన్న వెంటనే సంతోషంతో దాదాపు నృత్యం చేశారు.

మహాపురుష్‌జీ అనే ప్రఖ్యాత నామంతో ప్రసిద్ధులైన స్వామి శివానంద, శ్రీరామకృష్ణ పరమహంస సన్యాస శిష్యులు. వారి శిష్యులు నారాయణ మహారాజ్ సన్యాసానంతరం వారు బుల్ఢాణా స్వామీజీగా ప్రసిద్ధులు. మూర్తిగారు "ఏం చేద్దామా" అని ఆలోచిస్తున్న మరుసటి రోజు నుండి మండలం పాటు శ్రీబుల్ఢాణా

స్వామి పూనాలో భగవద్గీత మీద తరగతులవంటివి నిర్వహించి బోధన చెయ్యబోతున్నారని తెలిసింది మూర్తిగారికి. వెంటనే ఆయన పూనా వెళ్ళి స్వామీజీని కలుసుకుని తననొక విద్యార్థిగా ఆయన దగ్గర పేరు నమోదు చేయించుకున్నారు. ఆ మరునాటినుండి తెల్లవారుజాముననే పూనా వెళ్ళి, స్వామివారి ఉపన్యాసాలను షార్టుహాండులో వ్రాసుకొని మళ్ళీ తమ డ్యూటీ వేళకు బొంబాయి వచ్చేవారు. ఇది వారి దీక్షకు, పారమార్థిక సాధనయందు వారికున్న విశేష శ్రద్ధకు నిదర్శనమని చెప్పుకొనవచ్చును.

స్వామివారి దగ్గర గీతపాఠం చేసిన తరువాత, తాము గీతపై విన్న, స్వయంగా ఆలోచించి నిర్ణయించుకున్న భావాలనన్నిటినీ “శ్రీమద్భగవద్గీతా సాధన దీపిక” అని మూడు భాగాలుగా ప్రకటించి లోకోపకారం చేశారు శ్రీ మూర్తీజీ.

అయితే, ఆయన సమస్య మాత్రం తీరలేదు. “పరోక్ష జ్ఞానం లభించింది సరే. అనుభవ జ్ఞానం మాటేమిటి?” నిరంతరం ఆయన మనస్సులో ఈ ప్రశ్న కదులాడుతూండేది. బుల్ధాణా స్వామి శ్రీ మూర్తీజీకి సెలవిస్తూ “అధ్యాత్మ సాధనకు ముఖ్యమైనవి మూడుమెట్లు. అవి మనుష్యత్వం, ముముక్షత్వం, మహా పురుష సంశ్రయం. ఇక్కడ మహాపురుషుడుంటే గురుదేవుడు. నేను నీకు బోధకుడనూ, ఉపాధ్యాయుడనే కాని, గురువు కాను. సర్వవ్యాపియైన గురువును నువ్వు అన్వేషించనక్కరలేదు. ఆయనతోనీ సంబంధం జన్మజన్మల నుండీ వస్తున్నదిగానీ, యీనాటిది కాదు. కనుక ఆయనే నిన్ను తనదరిజేర్చుకుంటాడు. నువ్వు చెయ్యవలసిన పనల్లా విశ్వాసంతో విచారణ చేస్తూ నియమబద్ధంగా, ధర్మబద్ధంగా జీవించటమే. నువ్వు ఏ పనిచేస్తున్నా ; గురువు నిన్ను గమనిస్తున్నాడనే విషయం మరువకపోతే నువ్వు తప్పు చెయ్యలేవు. నీబోటి సాధకులు అరుదు. నీకు తప్పక గురుకృప ప్రాప్తిస్తుంది” అని దీవించారు.

ఆ తరువాత “సమర్థ సద్గురు” పత్రిక ద్వారా కుట్టితో పరిచయమేర్పడి మూర్తీజీ ఆశ్రమానికి రావటం, అందరికీ తెలిసిందే. శ్రీగురుదేవుల వ్యూహంలో కుట్టి, సమర్థ సద్గురు మాసపత్రికా, మూర్తీజీ పి.ఏ. ఆచారిగారు, గురుదేవులు మూర్తీజీని రప్పించుకోవటానికి వినియోగించుకొన్న పాత్రలు.

ఆశ్రమానికి వచ్చినా, మూర్తీజీకి శ్రీబాబూజీ సామీప్యం అంత తేలికగా లభించలేదు. కాని దూరంనుంచే బాబును చూచిన ఆయనలో ఆనందం పొంగి పొర్లేది. తాను వెతుక్కున్న నిదానం దొరికిందని భావాతీతమైన ఆనందంలో మునిగిపోయేవారు మూర్తీజీ. ఉన్నట్లుండి ఒకరోజునశ్రీబాబూజీ పాదపద్మాలకు నమస్కరించుకొనే అవకాశం వచ్చింది. “ నేనెవరోతెలుసుకునే భాగ్యాన్ని నాకు ప్రసాదించు గురుదేవా” అని మనస్సులో అనుకొని నమస్కరించిన మూర్తీజీ

తలమీద తమ దివ్యహస్తాన్ని ఉంచి దీవించారు గురుదేవులు. హస్తమస్తక సంయోగమైతానెవరో తాను తెలియని స్థితిలో స్పృహ కోల్పోయినట్లు తోచినా, అది మూర్తీజీకి "సమర్థసద్గురు దేవులు తనకు ప్రసాదించిన అభౌమము, అనిర్వచనీయము అయిన అమృతానుభవ"మని వారు తమ రచనలో తెలియజేశారు.

ఆ తరువాత వారు ఆశ్రమానికి నివాసాన్ని మార్చుకున్నారు. శ్రీబాబూజీ వాక్యాలను దృఢంగా విశ్వశించి, శ్రీమాతాజీవారిని గురుమూర్తిగా అంగీకరించారు. ఎంత కష్టమైనా, గురువాక్య పాలన మూర్తిగారు తనకు తాను నిర్ణయించుకున్న సాధన మార్గం. ఆయన ఎప్పుడూ పురాణం చెప్పినవారు కాదు. కానీ గురు వాక్యపాలనగా భాగవతం పురాణం చెప్పారు. ఆయనకు మహాన్యాసమూ, నమకచమకాలూ అంతకు ముందురావు. కానీ గురు వాక్యం పాటించి అన్నీ తాను నేర్చుకోవటమేకాక, యింకా కొంతమందికి నేర్పారు. అలాగే ఉపనిషత్తులు, శివకల్యాణం, సీతారామకల్యాణం, రాధాకృష్ణ కల్యాణం.... ఆయన 70 ఏళ్ళు దాటిన వయస్సులో వీటినన్నిటినీ పాఠంచేసి వల్లెవేశారని వింటే "అమ్మో!" అని ఆశ్చర్యంతో గుండె మీద చెయ్యి వేసుకోని వారుండరు.

జీవితంలో కష్టసుఖాలను ఉదాసీనంగా గమనించ గలిగిన మహామనీషి శ్రీమూర్తిగారు. ఆయన కుమార్తె వివాహానికి ఎంత సాదాసీదాగా ఉన్నాడో, భార్య మరణానికీ అంతే ఉదాసీనంగా ఉండగలిగాడు. ఆహార విషయంలో ఆయన చేసిన సాధనలు విచిత్రంగా వుండేవి. కటిక ఉపవాసాలనుండి, ఒంటి పూట భోజనం దాకానేకాక, కొంతకాలం ద్రవాహారం మాత్రమే తీసుకునీ, కొంతకాలం ఫలాహారం మాత్రమే తీసుకొనీ సాధన కొనసాగించేవారు. ఈ సాధనంతా తాను శారీరకంగా తీవ్రమైన ఆయాసంతో బాధపడుతూనే కొనసాగించేవారు. చిట్టచివరిగా శ్రీమాతాజీవారు తమ నోటిలో పోసిన తీర్థన్ని చిరునవ్వుతో స్వీకరించి, అమరులై, గురుసాయుజ్యాన్ని పొందిన శ్రీ G..S.R మూర్తిగారిని స్మరించటం మనధర్మం.... కాదు కాదు - మన కర్తవ్యం.

అన్నింటినీ మించి ఆయన శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమానికి అందించిన మరొకటీ, అన్నిటికంటే ముఖ్యమైనదీ అయిన సేవ "సమర్థ సద్గురు" పత్రికను అత్యంత సమర్థులైన సంపాదకులుగా నిర్వహించటం. శ్రీమద్దినాగేశ్వర రావుగారి వంటి మహా సమర్థులైన సంపాదకుల తరువాత అదే స్థాయిలో పత్రికను నిర్వహించి పాఠక శ్రేణుల అభినందనలను స్వీకరించ గలగటం వారి సామర్థ్యానికి నిదర్శనం. వారి సంపాదకీయాలు వారి ప్రతిభకు నిదర్శనాలైతే, వారు నిర్వహించిన "భద్రవాక్య"ది శీర్షకలు వారి పాండిత్యానికీ, వ్యుత్పన్నతకూ నికషోపలములు *




(గతసంచిక తరువాయి) -రమణ ప్రసాద్

"శ్యమంతకం అతని వద్ద లేకపోతే దొంగవలె ఎందుకు పారిపోతాడు? యాదవ సభలో మనం అతనిని పిలువనంపినప్పుడు అతడు రాకుండా ఎందుకు పారిపోయాడు?''

అన్నగారూ! మీరడిగిన ప్రశ్నలే నన్ను కూడా కలవర పెడుతున్నాయి....''

బలరాముడు దీర్ఘాలోచనలో పడ్డాడు. శ్యమంతకమణి అమూల్యమైనది. దానిని కృష్ణుడు కూడా అడిగాడు. సర్వజనహితంకోసం ఆ మణిని అడిగింది కృష్ణుడే.... బలరాముడు స్థంభించిపోయాడు. కృష్ణుడేమైనా ఈ మణికోసం... అతడేమైనా శతధన్వుని హత్యచేసి మణిని హస్తగతం చేసికొని ఉంటాడా?.... ఆ అమూల్య ధనరాశిలో బలరామునికి భాగం ఇవ్వవలసి వస్తుందని మణిని దాచేశాడా? తనని, సమస్త యాదవగణాన్ని మభ్యపెట్టాలని చూస్తున్నాడా?...

'ఏమిటి ఆలోచిస్తున్నారు మీరు?'' అని సరళ స్వభావంతో అన్నాడు.. పదండి మనం వెళ్ళి ద్వారకలోని పెద్దలందరికీ ఈ వృత్తాంతం వినిపించాలి.''

"కృష్ణా!'' బలరాముని భృకుటి ముడిపడింది 'ఏ మణి కోసం మనం వచ్చామో దానిని ప్రాప్తం చేసికోకుండా, దాని సంకేతం తెలియకుండా మనం ద్వారకకు వెళ్ళటం సమంజసంగా ఉండదు''

'అన్నగారూ!' కృష్ణుడు మళ్ళీ మృదువుగా అన్నాడు "మనం అపరాధిని దండించటానికి కదా వచ్చింది!... మనం ఆ కార్యం పూర్తి చేశాం.... మణికోసం కాదు.''

"నీ మాటలు నాకు విశ్వాసాన్ని కలిగించటంలేదు కృష్ణా!'' బలరాముడు తన భావాన్ని వ్యక్తం చేస్తూ "నీ శబ్దజాలంలో నేను చిక్కుకునేంత అమాయకుణ్ణి కాదు...'' అన్నాడు.

'అంటే? మీరు ఏమంటున్నారు?'' అన్నాడు కృష్ణుడు ఆశ్చర్యచకితుడై.

అతని నుదుటనున్న మయూరపంకం ప్రక్కకి వంగింది... కృష్ణుడి ముఖంలో చిరుదరహాసం మాయమైంది.

బలరాముడు ఆక్రోశపూరితుడైనాడు. అతని కోపం అవధులు దాటగా "ఈ శ్యమంతకమణిని శతధన్వుని హత్య చేసి నువ్వే తీసుకొని ఉంటావు. కాని లోభం వల్ల... అందులో నాకు భాగం ఇవ్వాల్సి వస్తుందని అనుకొని ఉంటావు. అందువలన దానిని ఎక్కడో దాచేశావు..."

'అన్నగారూ... అన్నగారూ....' కృష్ణుడికి ఏడుపు ఆగలేదు... అతని స్వరంలో ఇంత ఉదాసీనత ఇంతకు పూర్వం ఎప్పుడూ లేదు... జీవితంలో మొదటిసారిగా అసహాయస్థితిలో పడ్డాడు...

"అవును! ఎంతవరకు శ్యమంతకమణి దొరకదో అంతవరకు నేను ద్వారక వెళ్ళను... ద్వారకలోని యాదవులకు ఇటువంటి లజ్జాస్పదమైన వృత్తాంతం చెప్పేందుకా నేను ద్వారకకు వెళ్ళేది. నావల్ల ఇది కానిపని..."

'అన్నగారూ... మీరు చెప్పింది చాలా అన్యాయంగా ఉంది..."

"న్యాయాన్యాయాల నిర్ణయం సమయమే చేస్తుంది... నేను ఇక్కడనుండి మిథిలకు వెళతాను... అక్కడే ఉంటాను.... శ్యమంతకమణిని వెతుకుతాను. నువ్వు నీ దుష్కార్యం ఎంతవరకు అంగీకరించవో అంతవరకు నేను ద్వారకలో అడుగు పెట్టను...యాదవ వీరులందరికీ నా నమస్కారములు అని చెప్పు కృష్ణా!"

సంకర్షణుడు వెనుదిరిగాడు....

వెనుతిరిగి వెళ్తున్న అన్నగారైన బలరాముణ్ణే చూస్తున్నాడు కృష్ణుడు. "అన్నగారూ..." కృష్ణుడు మళ్ళీ పిలిచాడు... కాని పెదవులు కదిలాయే గాని శబ్దం బయటికి రాలేదు. బలరాముడు చెప్పినది అంతా అతని కల్పన మాత్రమే.

శ్యమంతకం... కృష్ణుడు దాని విషయం ఎత్తినప్పుడు అది కేవలం యాదవ కులాన్నే దృష్టిలో పెట్టుకొనేకాదు - ద్వారకలోని పురజనులకోసమే కాదు - సరిహద్దులలో ఉన్న ఆర్యవర్తం కోసమే కాదు - వర్తమానమే కాదు - ఆయన దృష్టిలో అనంత భవిష్యం ఇమిడి ఉంది. ఆ తరాలు ఇంకా జన్మించనే లేదు. వారికి కూడా కళ్యాణం జరగాలని భావించాడు. అట్టి అలౌకిక శక్తి గల శ్యమంతకాన్ని చిన్నచూపు చూస్తాడా! ఇప్పుడు బలరాముడు ఏమిటి అంటున్నాడు - "కృష్ణా! సత్రాజిత్తు చేసిందే శతధన్వుడు చేశాడు. నువ్వు

అంతకంటే అధమమైన పని చేశావు జనార్దనా.... కృష్ణా నువ్వు చోరుడివి... అవును చోరుడివి!''

ఆకాశం నల్లరంగు పులుముకుంది - జలాశయాలలోని తరంగాలు స్థంభించిపోయాయి. వీచేగాలి వృక్షాలలోని ఆకులలో దాక్కుంది... పక్షుల కంఠాలు రుద్ధమైనాయి... నెమలిపింఛం తల దించుకుంది...

బలరాముడు కనిపించేంతవరకు అతనినే చూస్తూ ఉన్నాడు... మనస్సులో జరిగిన ఘటనాక్రమం మెదలసాగింది - కంసుని మరణం తరువాత ఉగ్రసేనుణ్ణి మధురా గణాధిపతి స్థానంలో ప్రతిష్ఠించటం సామాన్యమే.... కంసుని చంపటం కూడా పెద్ద విషయం కాదు..., జరాసంధుని ఆక్రమణం అంత బరువు అనిపించలేదు.. కాలయవనునితో తలపడటానికి ఒకక్షణం కూడా వెనుకాడలేదు.... కాని బలరాముడు చేసిన ఆక్షేపణకు ప్రత్యుత్తరం ఎలా ఇవ్వటం... స్వయాన తన సహోదరుడు. వాసుదేవుని రక్తం పంచుకు పుట్టినవాడు... కృష్ణుడు ప్రతిమలాగా అయిపోయాడు... తరువాత కనులు మూసుకున్నాడు....

తిరిగి కనులు తెరిచాడు. అంతా పూర్వంలాగే ఉంది. ఆకాశం ప్రకాశంతో నిండి ఉంది. జలాశయంలో తరంగాలు ఎగసి పడుతున్నాయి... వాయువు ప్రాణులన్నిటిని సంరక్షిస్తోంది.... పక్షులు కలకలారావాలు చేస్తున్నాయి.

భవిష్యంలో రానున్నదానికి బీజారోహణ అయింది. కురుక్షేత్ర రంగంలో ఉచ్చరించినది... ఆకులలోనుంచి ప్రతిధ్వనిస్తోంది - **నమే లింపంతి కర్మాణి,న కర్మ ఫలే స్పృహా''**

బలరాముడు ద్వారకను త్యాగం చేసిన తీరుకి యాదవులందరూ దుఃఖించారు. కృష్ణుడు వారినందరినీ సమాధాన పరిచాడు. శ్యమంతక మణిని వెతకటానికి నిశ్చయించుకున్నాడు. కాని బలరాముడు నాటిన శంక అనే బీజం అతని మనస్సులో నాటుకుపోయింది. బాహ్యంగా ఎవరూ ప్రకటించలేదు కాని అందరూ కృష్ణుణ్ణి... అశ్రద్ధగా చూడసాగారు.

-సశేషం

---

Printed, Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL